## ఒకే ఒక్క 'హామీ'తో "హీరో" అయిన ఎమ్మెల్యే 'బండారు'

**మండల సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యేను ప్రశంసలతో ముంచెత్తిన లంకవానిపాలెం గ్రామ సర్పంచ్ దొరబాబు**

(7వ పేజీ నుంచి తరువాయి)

చర్చించి ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే జల జీవన్ మిషన్ లో భాగంగా లంకవానిపాలెం గ్రామానికి చెందిన వాటర్ ట్యాంక్ నిర్మాణం మరియు ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయిలు గురించి ప్రస్తావన రాగా,వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని,ఇంటికి కుళాయిలు అందించేలా పనులు పూర్తి చెయ్యాలని అధికారులకు తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం లంకవానిపాలెం గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి గ్రామానికి సంభందించిన 98 సెంట్లు భూమి గురించి ఎమ్మెల్యేకు వివరించి,ఈ భూమి విషయంలో చాలా కాలంగా వాటాధారులు,గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను,గ్రామంలో జరుగుతున్న సంఘటనలను గురించి చర్చించిన విషయం తెలిసిందే. సదరు భూమి గ్రామంలోని ప్రజలు అందరికి ఉపయోగపడేలా,గతంలో మాదిరిగా స్థలంలో శుభకార్యములు నిర్వహించుకునేందుకు దేవస్థానం అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. బండారు ప్రజా సమస్యలపై చూపిస్తున్న చొరవకు, అలాగే తమ గ్రామ సమస్యలను సమసిపోయేలా చేస్తానని హామీ ఇచ్చినందుకు, ఆయన వ్యక్తిత్వానికి లంకవానిపాలెం గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. లంకవానిపాలెం గ్రామ ప్రజలు ఎంతో కాలంగా ఎదురు ఈదుతున్న సమస్యలకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆ గ్రామ సర్పంచ్ వేచలపు దొరబాబు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని ప్రశంసలతో ముంచెత్తారు. ఎమ్మెల్యే పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి బండారు అని వ్యాఖ్యానించారు. ఆరు పదుల వయసులో నాయకుడిగా ఆయన పనితీరు,ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న అవగాహన,ఆ సమస్యలపై ఆయన చూపిస్తున్న చొరవ నేటి యువ నాయకులకు ఆదర్శ వంతం అని ప్రశంసల జల్లు కురిపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డి జగన్ మోహన్, మండల రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండలంలో అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

## 17న విశాఖకు సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్

(7వ పేజీ నుంచి తరువాయి)

ద్రవ్యాలు, ఆయుధాలు పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇవ్వడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యం . స్థానికులు మరియు భద్రతా సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, ముఖ్యంగా యువతకు మాదక ద్రవ్యాల ముప్పు, తీర భద్రత ప్రాముఖ్యత గురించి చైతన్యం కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఈ సైక్లోథాన్ మార్చి 17 న విశాఖపట్నంకు చేరుకోనుంది. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాలీకి సాంప్రదాయ స్వాగతం అందించేందుకు బీచ్ రోడ్ లో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇక ర్యాలీని కొనసాగించేదుకు వీలుగా 18 వ తేదీన ప్రత్యేక సెండ్-ఆఫ్ కార్యక్రమం నిర్వహించనుంది. సైక్లోథాన్ కు ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి డా. ఎం. అంగముత్తు, ఐఏఎస్, చైర్‌పర్సన్, విపిఏ ప్రధాన అతిథిగా హాజరుకానున్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్, విశాఖపట్నం పరిపాలనా అధికారులు, పోర్ట్ సీఐఎస్ఎఫ్ విభాగం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ స్థానిక ప్రజలను చైతన్య పరచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది, ముఖ్యంగా యువతలో తీర భద్రతపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనుంది.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన స్పీకర్ అయ్యన్న

(7వ పేజీ నుంచి తరువాయి)

వివరించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల అధ్యక్షుడు యర్రా పాత్రుడు, గంగవరం సర్పంచ్ ఎస్.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

(7వ పేజీ నుంచి తరువాయి)

చేయాలని అధికారులకు సూచించారు. ఊరు పరిశుభ్రంగా ఉంటే అందరి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.ప్లాస్టిక్ మందుల వినియోగంపై అధికారులతో పాటు పాలకవర్గం ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వీటి నిషేధంపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు.మున్సిపాలిటీలో రూ. 3.06 కోట్లతో 7,066 పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఇంటికీ కొళాయి ఇచ్చే విధంగా రూ. 166 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, రోడ్లు వేయకముందే పైపులైన్లు వేయాలని అధికారులను ఆదేశించారు.టిడ్కో ఇళ్లను పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రూ.14.11 కోట్లతో 28 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు.నూకాంబిక ఆలయ అభివృద్ధికి రూ. 50 లక్షలు కేటాయించామని, గత ప్రభుత్వ హయాంలో నూకాంబిక ఆలయ అభివృద్ధికి సీఎంఆర్ రమణ ఇచ్చిన రూ. 10 లక్షలు ఎక్కడ ఖర్చు చేశారో చెప్పలేకపోతున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ మున్సిపల్ కమిషనర్ జంప సురేంద్ర.. కౌన్సిలర్ చింతకాయల విద్యాపతి, చింతకాయ రాజేష్ బాబు జనసేన పార్టీ నర్సీపట్నం ఇంచార్జ్ రాజన వీర సూర్యచంద్ర, వార్డ్ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నాడు.

## వైసీపీలో జగన్... ఏకాకిగా మిగిలిపోతారు

(7వ పేజీ నుంచి తరువాయి)

విద్యా శాఖ మంత్రిగా ఉన్నత స్థానానికి తీసుకువెళ్లానని, వైసీపీ హయంలో అభివృద్ధి జరగక పోగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని చెప్పారు. గంజాయి, మాదక ద్రవ్యాలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు గ్రూపులు కట్టి పరస్పరం దాడులు చేసుకునే స్థాయికి వెళ్లారని తెలిపారు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తాను అసెంబ్లీలో ఉన్నందున తన కుమారుడు రవితేజను వివరాలు తెలుసుకోవాలని హైస్కూల్ కు పంపానని వివరించారు. పోలీస్, జీవీఎంసీ, విద్యా శాఖ ప్రతినిధులతో పాటు రవితేజ కూడా పాల్గొని సమావేశంలో చర్చించిన వివరాలను తనకు తెలియజేశారని వెల్లడించారు. విజువల్స్ ను సైతం చూడకుండా హెడ్ మాస్టర్ కుర్చీలో రవితేజ కూర్చున్నారని తప్పుడు కథనాలు రాయడం సరి కాదన్నారు. టీచర్లంటే తమకు అపారమైన గౌరవముందని, ఎప్పుడూ హెడ్ మాస్టర్ కుర్చీలో కూర్చోలేదని పేర్కొన్నారు. అధికారుల కుర్చీల్లో కూర్చుని వారినే నిలదీసిన చరిత్ర వైసీపీ నాయకులదని గంటా విమర్శించారు. చంద్రంపాలెం హైస్కూల్ ను గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకు వస్తానని చెప్పారు.

**మోడల్ నియోజకవర్గంగా భీమిలి**

2014 – 19 లో భీమిలి అభివృద్ధికి రూ.4,700 కోట్లు ఖర్చు చేసి నెంబర్ వన్ గా నిలబెట్టానని, ఇప్పుడు కూడా అదే స్థాయిలో అభివృద్ధికి పెద్ద పీట వేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో రూ.115 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, శంకుస్థాపనలు చేస్తున్నామని ఆయన చెప్పారు. కొమ్మాదిలో అసంపూర్తిగా ఉన్న కళ్యాణమండపాన్ని వైసీపీ హయంలో పట్టించుకున్న పాపాన పోలేదని, మళ్లీ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాన్ని పూర్తి చేయడానికి రూ.80 లక్షలు కేటాయించామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలియజేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. 6 వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, 5 వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, గరే గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ను ప్రైవేటీ కరించం అని పార్లమెంట్ లో ప్రకటన చేయాలి

**సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు**

గాజువాక,మార్చి 15,ప్రభాతవార్త:



విశాఖ ఉక్కును ప్రైవేటీకరించటం లేదని పార్లమెంటులో ప్రకటన చేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరానికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు విచ్చేసి"విశాఖ ఉక్కు కు ఊతమివ్వని ప్యాకేజీ"అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బి వి రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ముఖ్య సమస్య అయిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయంపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోలేదని ఆయన అన్నారు. ప్యాకేజీ ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని కానీ వాస్తవంగా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మరింత వేగంగా చేసేందుకు దోహదపడుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రజలు, స్టీల్ కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చులేని ప్రతిపాదనలను చేస్తుంటే వాటిని విస్మరించి నిర్వీర్యం చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. వీటికి అడ్డుకట్ట వేయవలసిన రాష్ట్ర ప్రభుత్వం దీనిని సమర్థిస్తూ విశాఖను ఆర్థిక, పారిశ్రామిక రాజధానిగా ఎలా మలుస్తారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం లోని ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు రాష్ట్ర ఎంపీలకు దిశా నిర్దేశం చేసే సమయంలో విశాఖ ఉక్కు సమస్యపై కేంద్రంపై ఒత్తిడి చేసే సమయంలో ఒకే గలాన్ని వినిపించే విధంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విధానపరంగా అనేక విభేదాలు కలిగిన రాష్ట్ర ప్రధాన రాజకీయ పక్షాలు ఐక్యంగా దీనిని కాపాడుకోవడానికి అవసరమైన మద్దతును సిపిఎం ఎల్లవేళలా అందిస్తుందని ఆయన అన్నారు. అదే సమయంలో కార్మిక హక్కులపై జరుగుతున్న దాడులను ఐక్య ఉద్యమాల ద్వారా ప్రతిఘటించి కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సిపిఎం పార్టీ కార్యవర్గ సభ్యులు లోకనాథం, జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి ఎం జగ్గు నాయుడు, జిల్లా సిఐటియు అధ్యక్షులు కె ఎం శ్రీనివాస్, ఎం రామారావు, స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కన్వీనర్ కెఎస్ఎన్ రావు, కో కన్వీనర్ రమణమూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు జె రామకృష్ణ, పి శ్రీనివాసరాజు, సుబ్బయ్య, సిహెచ్ సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, శ్రీనివాస్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం

**స్వచ్ఛ ఎలమంచిలి నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం... ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్.**

**స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ విజయ్ కృష్ణన్**

ఎలమంచిలి ,మార్చ్ 15, ప్రభాతవార్త:

నియోజకవర్గ అచ్యుతాపురం మండలం లోని జగన్నాధపురం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ్ ఆంధ్ర అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలుకుదాం-స్వచ్ఛ ఎలమంచిలి నియోజకవర్గంగా తీర్చిదిద్దామంటూ నినాదాలు చేశారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఎం జగన్నాధపురం గ్రామపంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చెత్త నుండి సంపదను సృష్టించి గ్రామాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. గ్రామంలోని అందరూ కలిసికట్టుగా ఉంటే గ్రామ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలోని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఆర్డిఓ, పంచాయతీ సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, మార్చి 15, ప్రభాత వార్త :

విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ & డెవలప్‌మెంట్ ట్రస్ట్ మరియు రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఐ.ఆర్.ఐ.ఎస్. (ఆంధ్ర మెడికల్ కాలేజ్) సంయుక్తంగా శనివారం కెజిహెచ్‌లోని గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో బెడ్ డొనేషన్ వేడుకను నిర్వహించాయి. విశాఖపట్నం సౌత్ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, ఎంఎస్ (ఆర్థో), ఎఫ్ఐఎస్ఎస్ (స్విట్జర్లాండ్) గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 20 మంచాలను విరాళంగా ఇచ్చారు మరియు వంశీ కృష్ణ శ్రీనివాస్ తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. మంచి పని చేసినందుకు రోటరాక్ట్ క్లబ్ వైద్యులను డాక్టర్ శివానంద అభినందించారు. ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి కె.వి. మంగా దేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ సిబ్బంది, డాక్టర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు...

## స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాఖపట్నం, మార్చి 15, ప్రభాత వార్త :

దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల శ్రీ ఎంబరు మన్నార్ స్వామి వారి దేవస్థానం కంచర వీధిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రములను సమర్పించారు. ఆలయ ఈవో అర్చకులు సాగర స్వాగతం పలికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ మాట్లాడుతూ స్వామివారి కృపా కటాక్షములతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి శ్రేణులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నుల వైభవంగా అద్దపు సేవ..!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ఆలయంలో స్వామివారికి అద్దపు సేవను ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు లతోపాటు అర్చకులు అందరూ భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణతో ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు .తర్వాత భక్తులకు అద్దంలో స్వామివారిని చూపించారు. అనంతరం తిరువేధుల్లో వేలాది మంది భక్తులు నడుమ కన్నుల వైభవంగా రథోత్సవం నిర్వహించారు. శనివారం భారీగా దర్శనాలకు భక్తులు తరలివచ్చారు. ఉపమాక, నక్కపల్లి గ్రామాల్లో భక్తుల సందడి తో పాటు జనాలు భారీగా రావడంతో రద్దీ ఏర్పడింది .

## అవంతి ఆధ్వర్యంలో హ్యూమన్ రిసోర్స్ నిర్వహణ అధికారులతో అవగాహనా సదస్సు

అనకాపల్లి, మార్చి 15, ప్రభాతవార్త:

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల 15 మార్చి 2025 అనగా శనివారం ఆర్ కన్వెన్షన్, స్టార్ హెూమ్స్, నర్సీపట్నం లో ఇండస్ట్రీ కనెక్ట్ పేరుతొ అవంతి ఆధ్వర్యంలో హ్యూమన్ రిసోర్స్ నిర్వహణ అధికారులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. అవంతి విద్యా సంస్థలు వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా సాఫ్ట్వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం, అడిషనల్ డైరెక్టర్ శ్రీ బి. సురేష్ ఉపన్యాసకులుగా విశిష్ట అతిధులుగా శ్రీ.సురేష్ నర్రా, DC హెడ్, ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్, విశాఖపట్నం), శ్రీ. వెంకట్ గజ్జల, (Sr VP, COO – గ్లోబల్ ఇంజనీరింగ్, టెక్ మహీంద్రా, హైదరాబాద్), శ్రీ. కిరణ్ సంగీత, CEO, Sails Software Inc., విశాఖపట్నం, శ్రీ. జితేందర్ సింగ్, (HR సీనియర్ మేనేజర్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్) CTS, హైదరాబాద్, శ్రీ. అభిషేక్ దోయిజోడ్, లీడ్ – క్యాంపస్ హైరింగ్, వర్తుసా, హైదరాబాద్, శ్రీ.వి.దూండి బాలచక్రదర్, ఆపరేషన్ లీడ్, HCL, విజయవాడ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా. సి మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. ప్రసాద్ రావు పాల్గొన్నారు. అవంతి విద్యా సంస్థలు వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ముఖ్య అతిధి శ్రీ బి. సురేష్, అతిధులు మరియు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రార్ధన గీతం తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవంతి విద్యా సంస్థలు వ్యవస్థాపకులు శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూగ్రామీణ యువతకు ఇంజనీరింగ్ విద్యను అందించే ఉద్దేశ్యం తో 25 సంత్సరాల క్రితం స్థాపించడం జరిగింది. మా విద్యార్థులు కమ్యూనికేషన్ లో కొంచెం వెనుకబడునప్పటికి వారు విషయ, సాంకేతిక పరిజ్ఞానం లో ముందుంటారు అలాగే నిబద్ధత తో పనిచేస్తారు. కనుక మీరు ఉద్యోగ సాధన పై మెలకువలు అందించి అవకాశాలు ఇవ్వడం ద్వారా వారి ప్రతిభను నిరూపించుకొని తల్లి తండ్రులు కు ఆర్థికంగా సహాయపడతారు. శ్రీ బి. సురేష్, సాఫ్ట్వేర్ టెక్నాలజీ పార్క్ అఫ్ ఇండియా, విశాఖపట్నం, అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ టెక్నాలజీ పార్క్ ఆ ఇండియా వ్యవస్థాపన అభివృద్ధి( ) వినూత్న ప్రాజెక్ట్ ను ప్రోత్సహాన్ని ఇస్తున్నామని తెలిపారు అందులో భాగంగా 1 లక్ష స్టార్ట్ అప్ ప్రాజెక్ట్ నుండి 1200 వినూత్న ప్రాజెక్ట్ ఎంఎంపిక్ చేశామన్నారు. మంచి ఉద్యోగ సంపాదించా లంటే కష్టపడి పనిచేయాలి చేసేపని సంకల్పం, అంకిత భావంతో చేయడం ద్వారా సత్ఫలితలను సాదిన్చా గలుగుతాము అదే మన తల్లి తద్రులకు మనమిచ్చే గౌరవం. శ్రీ. వెంకట్ గజ్జల, (Sr VP, COO% – గ్లోబల్ ఇంజనీరింగ్, టెక్ మహీంద్రా, హైదరాబాద్,శ్రీ. కిరణ్ సంగీత, (CEO, Sails Software Inc. , విశాఖపట్నం ), శ్రీ.. జితేందర్ సింగ్, (HR సీనియర్ మేనేజర్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్) CTS, హైదరాబాద్, శ్రీ. అభిషేక్ దోయిజోడ్, లీడ్ , శ్రీ.వి.దూండి బాలచక్రదర్, ఆపరేషన్ లీడ్, HCL, విజయవాడ, అర్టిఫిషల్ ఇంటెలిజెన్సు (AI) ఇన్ స్కిల్ డెవలప్మెంట్ వంటి విశిష్ట అతిధులు విద్యార్థులకు ప్రస్తుతం కంపెనీలలో కావలసిన వివిధ సాంకేతిక , కమ్యూనికేషన్ నైపుణ్యం మీద ఉపన్యాసాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి మోహన్ రావు మాట్లాడుతూ అవంతి ఇంజనీరింగ్ కళాశాల 25 సంవత్సరాలు క్రితం గ్రామీణ ప్రాంతం లో స్థాపించి వేల మంది ఇంజనీర్స్ ను తయారుచేసి NBA, NAAC విద్య ప్రామాణిక సంస్థల తో ఉత్తమ రేటింగ్ సాధించి 2023 లో కళాశాలకు 10 సంవత్సరాల పాటు స్వయంప్రతిపత్తి హెూదా కూడా సాధించింది. అలాగే విద్యార్థులకు ఉద్యోగ సాధన ఆధారిత శిక్షణ అందిస్తున్నాము. ఇటీవల మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు త్వరితగతిన పరిశ్రమలలో ఉద్యోగం సంపాదించుటకు కావలసిన నైపుణ్యం లభిస్తుందని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనుభవజ్ఞులైన పరిశ్రమల కార్యనిర్వాహికుల సూచనలు ఆచరించాలని విద్యార్థిని విద్యారులకు చూచించారు అనంతరం అవంతి విద్యా సంస్థలు వ్యవస్థాపకులు శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారు ముఖ్య అతిధులను, ఉపన్యాసకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఇంజనీరింగ్, MBA మరియు MCA శాఖాధిపతులు, అధ్యాపకులు 1500 మంది విద్యార్థిని విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## అదివాసీ మహిళలకు గీతం బిజినెస్ స్కూల్ ఉపాధి శిక్షణ

విశాఖపట్నం, మార్చి 15, ప్రభాత వార్త :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామ రాజు లోని వివిధ గ్రామాల జిల్లా అదివాసీ మహిళలందరికీ విద్య మరియు ఉపాధి శిక్షణా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. అరకువెలీ లో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమాలలో గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు షీలా, డాక్టర్ కృష్ణ కుమారి, డాక్టర్ శ్రీలలిత సాగి పాల్గొని మహిళలకు స్థానికంగా లభించే ఆకులతో ప్లేట్లు ఇతర సామగ్రి తయారీపై నైపుణ్య శిక్షణ అందించారు. ఈ శిక్షణ ఆదివాసీ మహిళలకు విలువైన వ్యాపార నైపుణ్యాలను నేర్పించడంతో పాటు, వారికి స్థిరమైన ఆదాయాన్ని సంపాదించడానికి మరియు వారి జీవన ఉపాధిని మెరుగుపర్చడానికి ఉపకరిస్తుందని ప్రొఫెసర్ షీలా పేర్కొన్నారు.ఈ శిక్షణ అనంతరం స్థానిక మహిళలు తక్షణం తమ ఉత్పత్తులు తయారు చేయడానికి వీలుగా హత్తాగూడా, తురైగూడా, కరైగూడా మరియు చినాల్గూడా మహిళలకు ఆకులతో ప్లేట్లు తయారు చేసే యంత్రాన్ని అందించారు. టొయోట్సు రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ యంత్రాన్ని తమ సి.ఎస్ .ఆర్ నిధుల నుంచి అందించించడానికి ముందుకు వచ్చింది. ఈ యంత్రం ఆదివాశీ మహిళల ఉపాది మార్గాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ, వారి వ్యాపార కార్యక్రమాలను సులభతరం చేస్తుందని సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ మురళీధర రావు పేర్కొన్నారు. గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యుల కృషిని అభినందించారు.

## విమ్స్‌లో స్వర్ణాంధ్ర - స్వచంద్ర

ఆరిలోవ, మార్చి 15, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని విమ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు హాజరయ్యారు. విమ్స్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను ప్లాస్టిక్ ను సిబ్బందితో కలిసి శుభ్రత చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేసుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మేరకు ఆస్పత్రి మొత్తం పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. ఈనెల ప్లాస్టిక్ వినియోగం నిషేధించటం అనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన మానవజాతి తో పాటు జీవరాశులకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి కాగితం కవర్లు, గోని సంచులు, క్లాత్ తో తయారు చేసిన సంచులు వినియోగించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ముఖ్యంగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చే వైద్యులకు ఆసుపత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా.. పరిశుభ్రంగా ఉంటే రోగం వేగంగా తగ్గటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏ ఓ భాజిత్,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

## పరిశుభ్రత పై అందరికి అవగాహన ఉండాలి. సూపర్డెంట్ డాక్టర్ భారతి



అగనంపూడి ప్రభాత వార్త.

అగనంపూడి ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్రనిర్వహించారు. ఈ కార్యక్రమం లో బాగంగా వైద్యులు,సిబ్బంది ప్రతిజ్ఞ చేసారు.ఆసుపత్రి లోపల,బయటపరిశుభ్రంగా ఉంచడానికి ఆసుపత్రి లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జె.భారతికోరుతూ సిబ్బందికి తగుసూచనలు చేసారు.ఆసుపత్రికి వచ్చిన రోగులకు వారితో వచ్చిన సహాయకులకు,శానిటేషన్ వర్కర్లుకి అంటు రోగాలు సోకకుండా ఎటువంటి జాగ్రత్తలుతీసుకోవాలో తగు సూచనలు చేసారు.ఈ కార్యక్రమం లో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ డి.వి.ఎస్.ఎన్.రాజు,వైద్యులు, నర్సింగ్, పారామెడికల్,నాల్గవ తరగగతి,శానిటషన్,సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## 51వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్

మాధవధార :మార్చ్ 15



జీవీఎంసీ 51వ వార్డులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.ప్లాస్టిక్ ను నిషేధించాలి,క్లాత్ బ్యాగ్స్ నే వాడాలనే నినాదంతో భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఈస్ట్ పార్కు లో వాకర్స్ కు,చిరు వ్యాపారులకు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించారు.స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లో భాగముగా పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా మన ఆరోగ్యం చక్కగా ఉంటుందన్నారు.ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు నిషేధించి భావితరాల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చెయ్యాలని కోరారు.కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్, సెక్రటరీలు,నాయకులు ఎద్దు పైడ్రాజు,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## లింగన్నపేట గ్రామంలో ప్రారంభమైన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు.



పద్మనాభం, మార్చి 15, ప్రభాతవార్త :

మండలంలో లింగన్నపేట గ్రామంలో గ్రామ టీడీపీ నాయకుడు పైల శ్రీను ఆధ్వర్యంలో శనివారం అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తుల సహకారంతో గ్రామ ప్రారంభంలో లక్షలాది రూపాయలతో నూతనంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. అయితే ఈ మహోత్సవాలు సందర్భంగా ఉదయం సి.హెచ్.సూర్యనారాయణ అర్చక బృందం గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప పూజ ,హోమం,అఖండ దీపారాధన చేపట్టారు. సాయంత్రం బారీగా పూర్ణకళశాలతో ఉత్సవ మూర్తులను సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం జలాదివాసం నిర్వహించారు. అలాగే 17 వతేదీన ఆలయ ప్రాంగణంలో బారీ అన్న సమారాధన ఉంటుందని పైల శ్రీను చెప్పారు.

## సింగల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి... గుడ్డ..నార సంచులనే వాడాలి



గాజువాక,మార్చి 15,ప్రభాతవార్త:

జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఇఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్పిటల్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి,చెత్తను తొలగించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ పర్యావరణానికి హానికరమైన సింగల్ యూజ్ ప్లాస్టిక్ కు స్వస్తి పలికి గుడ్డ, నార సంచులనే వాడాలని పిలుపునిచ్చారు. అలాగే కాలుష్య నిర్మూలనకు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం అని అన్నారు. అనంతరం ఈఎస్ఐ హాస్పటల్ సూపర్డెంట్ బీవీ రామణమూర్తి,సిబ్బందితో కలిసి మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ సోమశేఖర్ , డాక్టర్ సునీత , డాక్టర్ ఫణీంద్ర , నర్సింగ్ సూపర్డెంట్ నాగమణి, ఈఎస్ఐ హాస్పటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అన్న సమారాధన

గాజువాక,మార్చి 15,ప్రభాతవార్త:



జీవీఎంసీ 74 వ వార్డు క్వారీ రోడ్డు లో ఉన్న శ్రీశ్రీశ్రీ స్వర్ణ నూకాంబిక ఆలయం ప్రగణం లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశి రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కొత్త అమావాస్య పండుగ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. సుమారు 5000 మంది అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొనడం శుభ సూచికం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ,మహిళ కమిటీ,గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో ఘనంగా స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర.



పద్మనాభం, మార్చి 15, ప్రభాతవార్త:

మండలంలో పలు గ్రామాలలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు శనివారం అధికారులు,నాయకులు ఘనంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కె.రాంబాబు, మండల అధికారులు, టీడీపీ నాయకులు కుంతీమాధవస్వామి ఆలయం, మండల కాంప్లెక్స్ ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పారిశుధ్యంపై వారు ప్రతిజ్ఞ చేసారు. అలాగే వివిధ గ్రామాలలో కూడా పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ విజయకుమార్, ఈఒఆర్డి మీనాకుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు కె.రమణ, బి.జె.పి.అధ్యక్షురాలు నాగమణి నాయకులు దాము, ఎర్రినాయుడు, సోమేశ్వరరావు,వెంకట్రావు పాల్గొన్నారు.

## బాల వికాస్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

ఆనందపురం, మార్చి 15, ప్రభాతవార్త:



మండలంలోని గొట్టిపల్లిలో ఉన్న శ్రీ సత్య సాయి సమీకృత సేవా మందిరం బాల వికాస్ విద్యార్థులకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఆనందపురం శ్రీ సత్య సాయి భజన మండలి సీనియర్ సేవాదళ్ కొట్యాడ లక్షణమూర్తి సహాయ సహకారాలతో స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంటు అప్పారావు చేతుల మీదుగా అంద చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ దబ్బీరు విజయ్ కుమార్, భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, కో కన్వీనర్ డీపీజె ఎస్ వి రత్నం ( డిపి రాజు ), బాల వికాస్ కోఆర్డినేటర్ దబ్బీరు వెంకట సంతోష్ కిరణ్, సీనియర్ సేవాదళ్ వత్సవాయి కృష్ణమూర్తి రాజు, సేవాదళ్ కోఆర్డినేటర్ డి కార్తీక్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

సుజాత నగర్ బ్రాంచ్ (15369), 13-18/2, శ్రీనివాస కాంప్లెక్స్, బిఆర్‌టిఎస్ రోడ్డు, సుజాత నగర్, విశాఖపట్నం - 530051. ఫోన్ : 9492808419

**బంగారు నగల వేలము ప్రకటన**

ఈ దిగువన ఉదహరించిన వ్యక్తులు బంగారు నగల హామీపై బ్యాంకు నందు అప్పు తీసుకుని బ్యాంకు నిబంధనల ప్రకారం అప్పు తీర్చనందున వారి బకాయి చెల్లించి వారి యొక్క నగలు విడిపించుకోవలసిందిగా కోరుచూ రిజిష్టర్ నోటీసు ద్వారా తెలియజేసినప్పటికినీ వారు ప్రతిస్పందించనందున వారు బ్యాంకునకు తాకట్టు పెట్టిన బంగారు నగలు తేది.29-03-2025 అనగా శనివారం సాయంత్రం గం.4-00 లకు బ్యాంకు నందు బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొనదలచిన వారు రూ.15,000/- (అక్షరాల పదిహేను వేల రూపాయలు) ధరావత్తు సొమ్మును "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా", సుజాతనగర్ బ్రాంచి, విశాఖపట్నం పేరున డిడి/బ్యాంకర్స్ చెక్ ద్వారా బ్యాంకు పనిచేయు వేళలలో జమచేసి వేలములో పాల్గొనవలెను. వేలములో వస్తువులు పాడుకొనిన వారు మిగతా సొమ్మును అదే రోజు బ్యాంకు నందు చెల్లించి వస్తువులను పొందవచ్చును. అట్లు చెల్లించని ఎడల పాటదారులు తమ యొక్క ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. ఆసక్తి కలిగిన వ్యక్తులు సదరు బహిరంగ వేలములో బంగారు నగలు కొనుగోలు చేయవచ్చును. వేలమునకు సంబంధించిన వివరములు ఇతర విషయములు బ్యాంకు పనిచేయు వేళల యందు బ్యాంకు యొక్క కార్యనిర్వాహణాధికారి వారిని సంప్రదించగలరు. ఎట్టి కారణములు చూపకుండా వేలము తేదీలలో మార్పులు చేయుటగాని, రద్దు చేయుటకు గాని, వేలం ఆఫర్ తిరస్కరించుటకు గాని బ్యాంకునకు సర్వహక్కులు కలిగియున్నవి.

| క్ర. సం | ఖాతా నెం. | ఋణగ్రస్తుని పేరు | ఆభరణముల వివరములు | గ్రాస్ బరువు గ్రా.లలో |
|---|---|---|---|---|
| 1 | 41242179940 | టేకటి హేమవేణి, ఇ.నెం.6-128, శాంతి నగర్, పెందుర్తి, గవర్నమెంట్ స్కూల్ ఎదురుగా, విశాఖపట్నం – 531173. | రెండు వరుసల గొలుసు | 23.00 |

తేది: 15-03-2025, ప్రదేశం : విశాఖపట్నం సం/- బ్రాంచ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సుజాతనగర్

## తాళ్లపాలెంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం



కసింకోట, మార్చి 15, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సందర్భంగా శనివారం తాళ్లపాలెంలో అవగాహనా ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో గల రోడ్లను కాలువలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుభాషిని,ఎంపీడీవో వివి రవికుమార్, మండల విస్తరణ అధికారి వెంకటలక్ష్మి, ఎనర్జీ ఎస్ ఏపీవో శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకుడు పుల్లింగల రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎన్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు

## ఇసుక రవాణా, నిల్వలకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త :

తూర్పుగోదావరి మరియు శ్రీకాకుళం జిల్లాలోని ఇసుకరీచ్ ల నుండి ఇసుకను అనకాపల్లి జిల్లా లోని సబ్బవరం మండలం నిల్వ కేంద్రము వద్దకు రవాణా మరియు నిల్వ చేసి, నిల్వ కేంద్రం నుండి వాహనాలలో లోడ్ చేయుట కొరకు లాటరీ పద్ధతిన దరఖాస్తులు కోరడమైనదని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఇసుక కమిటీ చైర్మన్ విజయ కృష్ణన్ తెలిపారు. అనకాపల్లిజిల్లా నందు ఇసుక రీచ్ లు లేనందు వలన ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం మండలంలో తక్కువ మొత్తంలో ఇసుక కావలసిన వినియోగదారులు ఇసుక డిపో ద్వార ఇసుక సరఫరా చేయు నిమిత్తం ప్రైవేట్ వ్యక్తులకు మినరల్ డీలరు లైసెన్స్ ఇచ్చుటకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ, అనకాపల్లి వారు నిర్ణయం తీసుకోవడం జరిగినదని తెలిపారు. టన్ను అమ్మకం ధర 958రూపాయల ప్రకారం అమ్మకాలు జరుపుటకు, వాహనములు వెళ్ళుటకు మరియు వచ్చుటకు సరైన మార్గం గల ప్రైవేట్ స్థలము 4.00 ఎకరములు (లీజు లేదా సొంతం) కలిగి ఉన్న వ్యక్తులు మినరల్ డీలరు లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం వారి విధి విధానాలకు లోబడి పైన పేర్కొన్న ధరకు మాత్రమే ఇసుకను అమ్మవలెనని, స్టాక్ యార్డ్ లు ఏర్పాటు చేయుటకు 2 సంవత్సరముల ఇసుక యార్డ్ నిర్వహణ అనుభవం కలిగిన ఆసక్తి గల వ్యక్తులు మినరల్ డీలరు లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకొనవచ్చునని, ఇతర వివరములకు జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి, అనకాపల్లి వారిని (ఫోన్ నెంబరు 9100688822) సంప్రదించవలసినదిగా తెలిపారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర సాధనకు కదలిరండి



మాకవరపాలెం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధన ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సే నో టు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్ వై పాత్రుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్రప్రదేశ్-స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరు తన వంతు బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపడుతూనే పచ్చదనాన్ని పెంచాలని ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇంచార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను విద్యార్థులు తన తల్లిదండ్రులతో పాటు చుట్టుపక్కల వారికి అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 మూర్తి మాట్లాడుతూ స్వర్ణ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం పై విద్యార్థులు ముందుగా అవగాహన పెంచుకొని పెద్దలకు వివరించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మాకవరపాలెం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి, ప్లాస్టిక్ వాడక అనర్థాలపై విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో అధికారులు ప్రజా పద్ధతులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాకవరపాలెం పంచాయతీ కార్యదర్శి సేవ బాలదొర,ఉప సర్పంచ్ లాలం రాము,ఉపాధి హామీ పథకం ఏపీవో వరలక్ష్మి, వెలుగు ఏపిఎం మంగ అధిక సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పాయకరావుపేట రూరల్, ప్రభాతవార్త, మార్చిన15

పాయకరావుపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ అధికారులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా తడి చెత్త-పొడి చెత్త వేరు చేసే విధానం, ఐఎస్ఎల్ మరుగుదొడ్లు వాడే విధానం, ర్యాలీలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో యాక్టివిటీస్, మొక్కలు నాటే కార్యక్రమం మొత్తం 17 థీమ్స్ పై ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎ జయప్రకాశరావు, మండల ప్రత్యేక అధికారి జివి లక్ష్మీ, మండల విస్తరణ అధికారి సిహెచ్ చంద్రశేఖర రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఆర్డబ్ల్యూఎస్ వర్మ, కచేరి ఎపిఎం వెలుగు, సర్పంచులు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ ఎన్ డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



చోడవరం, మార్చి 14, ప్రభాతవార్త:

పి ఎస్ పేట హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పలరాజు చేతుల మీదుగా వందమంది పిల్లలకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి టెన్షన్లు లేకుండా పరీక్షల ప్రశాంతంగా వ్రాసి మంచి ఫలితాలు సాధించాలని హితవు పలికారు ముందు ముందుకు ఎస్ ఎన్ డి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మరిన్ని సేవలు చేయాలని అభినందిస్తూ ప్రశంసించారు ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు, ఎస్ ఎన్ డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రాజశేఖర్, కె పీ నాయుడు, టి ఎస్ ఆర్ నాయుడు, జి సూరిబాబు, డి వెంకట జయసింహ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త :

శ్రీ నూకాంబిక అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండి ఆదాయాన్ని శనివారం లెక్కించారు. తే 28-10-2024 ది నుండి నుండి 15-03-2025 ది వరకు మొత్తం 138రోజులలో సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను అమ్మవారి దేవస్థానము ఉత్సవ మండపంలో హుండీ లెక్కింపు జరిగినది. సదరు లెక్కింపులో నగదుగా రూ? 44,65,787/- లు, బంగారం 20.500 మిల్లి గ్రాములు? వెండి 1 కేజి 925 గ్రాములు వచ్చినది. హుండీ లెక్కింపులో ఆలయ సహాయ కమీషనరు %ు% కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు , జిల్లా ఏసి సుధారాణి, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వసంత కుమార్, కూటమి నాయకులు, పర్యవేక్షణలో లెక్కింపు జరిగినది. సదరు హుండీలో లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

## "వీసం నానాజీ" లను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)





నక్కపల్లి పట్నంలోని కోదండరాముని ఆలయ ప్రతిష్ట సందర్భంగా ప్రముఖ రాజకీయ నాయకులు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వీసం రామకృష్ణ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు వార్డు సభ్యులు అల్లాడ కొండబాబు, కొలనాటి దుర్గాప్రసాద్ దంపతులను ఆలయ కమిటీ పెద్దలు ఘనంగా సత్కరించి స్వామివారి ఫీల్డ్ అందజేశారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు



అనకాపల్లి,మార్చి 15, ప్రభాత వార్త :

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ఇది మనందరి బాధ్యత అని జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారా యణ రావు సూచించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో సిబ్బందితో కలిసి పాల్గొన్నారు, కలెక్టర్ కార్యాలయ పరిసరాలను శుభ్రం చెసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మనం నివశిస్తున్న మరియు పనిచేస్తున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని. ప్రతి ఉద్యోగి స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తను విడిదీసే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణనికి హానికరం అన్నారు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను ప్రతి ఉద్యోగి నిషేదించాలన్నారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు సిబ్బందితొ స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చెయించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి బి.వి. రాణి, సూపరింటెండెంట్ ఎస్.వి.ఎస్. నాయుడు, సిబ్బంది, పాల్గొన్నారు.

## శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ ఈవో గా రాంబాబు



అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త

: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం సహాయ కమిషనర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా శనివారం వెంపలి రాంబాబు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన రాంబాబును ఆలయ అర్చకులు, ఉద్యోగులు తదితరులు అభినందించారు.

## అన్నదాన కార్యక్రమంను ప్రారంభించిన ఉప కమిషనర్ సుజాత



అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త :

దేముని గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్ సుజాత ప్రారంభించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు దేవాలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్ సుజాత స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని పెద్దలు చెబుతుంటారు, సాక్షాత్తు కలియుగ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నదానం చేయడం దేవాలయానికే కాక ఈ ప్రాంత ప్రజలు భక్తులు సుఖ సంతోషాలతో ఉంటారని అన్నదానం అనేది ఎంతో మహత్యం కలిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి టి. రాజ సులోచన, దేవాలయం ప్రధాన అర్చకులు పులకడం గిరిబాబు, ధర్మకర్తలు గోలి మురళి, సిహెచ్ నూకరాజు వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, నిమ్మకాయల తులసి, మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పోలీసుల శ్రమదానం



అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త :

స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలం అన్న సూత్రాన్ని అనుసరిస్తూ, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు నాయకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలీసులు, కార్యాలయ సిబ్బంది కలసి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అదనపు ఎస్పీ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సమాజానికి వ్యక్తిగత బాధ్యతగా భావించాలని సూచించారు. పోలీసులుగా క్రమశిక్షణతో వ్యవహరించడం మాత్రమే కాకుండా ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా నిజమైన ఆత్మసంతృప్తిని పొందవచ్చని, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. అంతేగాక కార్యాలయ ప్రాంగణంలో చెత్త నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, డస్ట్ బిన్ల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ.ఓ రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు బాల సూర్యరావు, రమేష్, ఎస్సైలు రమణయ్య, వెంకన్న, అంజిబాబు, విశ్వనాథంఫణిదాసు, తదితర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన కోదండ రాముని ఆలయ ప్రతిష్ట



(నక్కపల్లి, ప్రభాతవార్త)

నక్కపల్లి పట్టణంలోని బందారుపేట వద్ద అత్యంత ప్రతిష్టాత్మక నిర్మించిన శ్రీ కోదండరాముని ఆలయ ప్రతిష్ట కార్యక్రమం శనివారం తెల్లవారుజాముతో ప్రత్యేక పూజ కార్యక్రమాలను అనంతరం స్వామివారికి హారతి సమర్పించి ఘనంగా ముగించారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్



(నక్కపల్లి, ప్రభాత వార్త)

స్వచ్ఛతే ఆరోగ్యానికి మూలం అన్న సూత్రాన్ని అనుసరిస్తూ, స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయ ఆవరణలో మూడవ శనివారం కావడంతో జిల్లా అధికారి ఆదేశాల మేరకు పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా సబ్ రిజిస్టర్ చెన్న నరసింహామూర్తి, ఉద్యోగులు సిలార్ ,పాపారావు, సిబ్బంది, కార్యాలయ ప్రాంతంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వినియోగదారులతో కలసి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచిన అనంతరం సబ్ రిజిస్టర్ నరసింహామూర్తి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైటర్ల సంఘ రాష్ట్ర నాయకులు డివివి మురళీకృష్ణ, కృష్ణమూర్తి, రమణాచార్యులు లతోపాటు పలువురు ఉన్నారు.

## చిన్నదొడ్డి గళ్ళు లో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ ర్యాలీ

( నక్కపల్లి, ప్రభాతవార్త )



మండలంలోని చిన్న దొడ్డి గళ్ళు గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణములలో కార్యదర్శి పీవీపీ రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు బి. కవిత , గ్రామ సర్పంచ్ బి .చంద్రరావు ల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది కలిసి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ నెల మూడవ శని వారం ప్రభుత్వ కార్యాలయాలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల పరిసరాలు, రైతు భరోసా కేంద్రం గ్రామ పంచాయతీ తదితర ప్రాంగణాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఉపాధ్యాయులు గ్రామ సచివాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు శాలువ తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర నాథ్ ఠాగోర్ ఇంగ్లీషు క్లబ్ వ్యవస్థాపకుడు వై వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పల్లెల్లో విజయవంతంగా స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్.!

( నక్కపల్లి, ప్రభాతవార్త)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఎండిఓ దెందుకూరి సీతారామరాజు, తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి, ఎంఈఓ లు నరేష్, వి .నూకరాజు జేఈ నాగభూషణం ల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో గ్రామసభ, బహిరంగ ప్రదేశములు శుభ్రపరచుట, ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా దుకాణం యజమానులకు అవగాహన కల్పించడంతోపాటు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభలో గ్రామంలో ఎస్ డబ్ల్యు పిసి కేంద్రంలో తయారైన వర్మి ఎరువును మండలంలోని డిఎల్ పురం లో ఉచితముగా రైతులకు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి. నరసింహారావు గ్రామ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ , ఎంపీటీసీ సభ్యులు కొండ్ర కనకారావు , కో -ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు , మాజీ సర్పంచ్ గింజల లక్ష్మణరావు, స్కూల్ చైర్మన్ దూళి హరిప్రసాద్, బిజెపి మహిళా సభ్యురాలు బుద్దాల నాగమణి , సచివాలయం సిబ్బంది ,వెలుగు సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మెప్మా ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం...



ఎలమంచిలి ,మార్చ్ 15, ప్రభాతవార్త:

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో ఎస్ ఎల్ ఎఫ్ పరిధిలోని ఎస్ హెచ్ జి సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయము నుండి స్టేషన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ధర్మవరం లోని రెండు ఎస్ఎల్ఎఫ్ సమావేశాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డిఎంఏ రవీంద్ర, మున్సిపల్ చైర్ పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పలు అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని, ప్రతి ఒక్కరూ జీవితంలో పలు రకాలుగా ప్లాస్టిక్ ముడిపడి ఉంటుందని ప్లాస్టిక్ నిషేధం ప్రతి మహిళ తలుచుకుంటే అమలవుతుందని ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నివారించడానికి ఎస్ హెచ్ జి సభ్యులందరూ బాధ్యతగా తీసుకోవాలని, అవగాహన పెంచుకుని అందరికీ తెలియపరచాలని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామాకుమారి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త కార్యక్రమాలు ధర్మవరం లోని బాగా నిర్వహిస్తున్నారని, హెూమ్ కంపోస్ట్, టెర్రస్ గార్డెన్, కిచెన్ గార్డెన్, లాంటివి అందరూ చేయాలని, చేతి సంచులు అలవాటు చేసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్యాన్సర్ పలు విధాలుగా జీవితాలను నాశనం చేస్తుందని, ప్లాస్టిక్ పూర్తిగా నిషేధం చేసే విధంగా అందరూ ముందు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం పద్మావతి, సిఎల్ఆర్ పిఎస్ సత్య, కృష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ బిబి, ఆర్పీలు పాల్గొన్నారు.

## పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర -, స్వర్ణాంధ్ర, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ.



ఎలమంచిలి, మార్చి 15, ప్రభాతవార్త:

పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ్ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం జరిగే కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, ప్రత్యామ్నాయ ఆరు వస్తువులు వినియోగం అనే అంశంపై ర్యాలీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పట్టణములోని కాంప్లెక్స్ రోడ్డు, స్టేషన్ రోడ్ నందు మాస్ స్కినెస్ కార్యక్రమం నిర్వహించారు.. అనంతరం ప్రతి వాడినందు పాఠశాల విద్యార్థులు ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో వార్డులు వారీగా ర్యాలీలు మానవహారం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ ఆఫీసు వద్ద ప్రత్యామ్నాయంగా ఉపయోగించవలసిన వస్తువులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థులు మెప్మా సిబ్బంది మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బందితో మున్సిపల్ ఆఫీసు నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ అవగాహన కార్యక్రమం మానవహారం ప్రతిజ్ఞ చేశారు. ఆర్డిఎంఏ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆటో గ్యారేజ్ వద్ద మొక్కలకు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సిఎంఎం పద్మావతి, మున్సిపల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## ఆకట్టుకున్న కోలాటాలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశాఖపట్నం చెందిన గోపాలపట్నం శ్రీ వాసుదేవ వెంకటేశ్వర కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో పాయకరావుపేట కు చెందిన వెంకట లక్ష్మీనారాయణ అన్నమయ్య కోలాటం భక్తులను అలరించింది.

## అచ్చుతాపురంలోనీ శిల్ప ఫంక్షన్ హాల్లో మునగపాక మండల సమావేశం



ఎలమంచిలి,మార్చి 15, ప్రభాతవార్త:

నియోజకవర్గంలో అచ్చుతాపురంలోనీ శిల్ప ఫంక్షన్ హాల్లో మునగపాక మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ , ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు , మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి లాలం భవాని భాస్కర్ , రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రీ సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ , గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భముగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తల గుండెచప్పుడు తెలుగుదేశం పార్టీ అని, చంద్రబాబు నాయుడు ఆదేశాలను ప్రతీ కార్యకర్త తూచా తప్పకుండా పాటించాలని, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకువెళ్లి, అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి, ఇది మన మంచి ప్రభుత్వం అనే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కుటుంబ సాధికార సభ్యులను గుర్తించి తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు, లాలం భవాని భాస్కర్ మాట్లాడుతూ విజన్ గల నాయకుడు చంద్రబాబు నాయుడు మార్గదర్శకం లో ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి పనిచేసే, ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను స్థాపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయరామరాజు, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వాహక కార్యదర్శి దాడి ముసలి నాయుడు, రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఆడారి జానకి, క్లస్టర్ ఇన్చార్జులు మొల్లేటి సత్యనారాయణ, పొరపాటి రాజశేఖర్ ,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్ , గ్రామ శాఖ అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో కదిలిన యువకులు



(నక్కపల్లి ,ప్రభాత వార్త) మూడవ శనివారం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యువకులు పాల్గొని గ్రామంలో ఉన్న కాలువలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు ఆ సభలో బహిరంగ ప్రదేశములు శుభ్రపరచుట, ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా దుకాణం యజమానులకు అవగాహన కల్పించడం, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభలో గ్రామంలో ఎస్ డబ్ల్యు పిసి కేంద్రంలో తయారైన వర్మి ఎరువును ఉచితముగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తోపాటు సర్పంచ్ పిక్కి అప్పలనరస, ఎంపీటీసీ సత్తయ్య, జడ్పిటిసి గోశల కాసులమ్మ, గ్రామ యువకులు గంగరాజు, మడత రాంబాబు, అంగన్వాడీ టీచర్ పైడితల్లి, కాచితల్లి ,దేవరాజ్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఛార్జీలు పెంచమంటూ కూటమి ప్రభుత్వం ప్రకటన హర్షణీయం



అనకాపల్లి, మార్చి 15, ప్రభాత వార్త :

రానున్న నాలుగేళ్ల కాలంలో విద్యుత్ ఛార్జీలు పెంచమంటూ కూటమి ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కొణతాల వెంకట్రావు అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లు కమిషన్ కోసమే విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారం ప్రజలపై వేసి వివిధ చార్జీల పేరట 32 వేల కోట్లు విద్యుత్ వినియోగదారులపై బాధుడే బాదుడు వేశారని అన్నారు. జగన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు చేయడం వల్ల విద్యుత్ వినియోగదారులపై పదిసార్లు ట్రూ ఆఫ్ చార్జీలు ఇంధనం సర్దుబాటు చార్జీలు రకరకాల పేర్లతో మోయలేనంత భారాన్ని వేయడంతో నేడు కూటమి ప్రభుత్వంపై అదనపు భారం పడిందని, 9 నెలలు కాలంలోనే పరిస్థితిని గాడిలో పెట్టారని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వచ్చే నాలుగేళ్లలో విద్యుత్ వినియోగదారులపై చార్జీల భారం పెంచమని ప్రజలకు శాసనసభ ద్వారా హామీ ఇచ్చారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం సంస్కరణలు తీసుకువచ్చిందని, ఈ ఫలితాలను సొమ్ము చేసుకున్న కాంగ్రెస్ పార్టీ 2004లో ఉచిత విద్యుత్ పేరుతో తిరోగమనంలోకి ఈ రంగాన్ని తీసుకెళ్లిందని, రాష్ట్ర విభజన తర్వాత లోటు విద్యుత్తును పూడ్చి 2018 నాటికి మిగులు విద్యుత్ స్థాయికి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకు వచ్చిందని అన్నారు. గత ఐదేళ్లలో అరాచక ప్రభుత్వం మళ్లీ విద్యుత్ రంగాన్ని తిరోగమన%శీ%లోకి తీసుకువెళ్లిందని , కమీషన్ల కోసం పీపీఏలను రద్దు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ వినకుండా, గత ప్రభుత్వంతో పిపిఏలు ఒప్పందం చేసుకున్న వారు హైకోర్టును ఆశ్రయించారని, వైసీపీ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన మొండిగా ముందుకు వెళ్లి అన్యాయంగా ప్రజల సొమ్మును 9000 కోట్ల రూపాయలు ఒప్పందాల రద్దుకు చెల్లించి ప్రజలపై భారం వేసారని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించిందని, యూనిట్ కొనుగోల ధరను 5.16 రూపాయల నుండి 4.80 రూపాయలకు తగ్గిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, భూతాపం వల్ల గ్రీన్ ఎనర్జీ కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయని, జగన్ రెడ్డి అసమర్థత వల్ల 62,826 కోట్ల అప్పు, ఇప్పుడు 1,12,422 కోట్లకు పెరిగిందని, అయినప్పటికీ ప్రజలపై భవిష్యత్తులో భారం పడకుండా దూరదృష్టితో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని, పెరుగుతున్న విద్యుత్ వినియోగదాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన కరెంటును సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, దానికి తగిన విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూర్య ఘర్ పథకానికి ఇస్తున్న సబ్సిడీకి అదనంగా కూటమి ప్రభుత్వం బీసీలకు 20000 వేలు ఇచ్చి మొత్తం 80 వేల రూపాయలు సబ్సిడీగా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటన చేశారని తెలిపారు. అలాగే ఇతరులకు 60000 సబ్సిడీ, ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానల్, దీని అందరూ వినియోగించుకోవాలని విద్యుత్ బిల్లులు ఆదా అవుతుందని, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు 5 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేయని, దీని ద్వారా 3 లక్షల70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

## మై హెూమ్ ఇండస్ట్రీ లోని స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర...



ఎలమంచిలి, మార్చి 15 ,ప్రభాత వార్త:

మండలంలోని ములకలాపల్లి గ్రామంలో గల మై హెూమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) ఆవరణలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర, మన ఆంధ్రప్రదేశ్ను స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దాలని ప్రభుత్వ సంకల్పంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శనివారం ఫ్యాక్టరీ ఆవరణలో గల రోడ్లు శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీనియర్ జీఎం (ఆపరేషన్) బి రామస్వామి ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ వినయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ మనం పని చేసే చోట కాకుండా మనం నివసించే దగ్గర మన చుట్టుపక్కల ప్రాంతాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఏ విధమైన రోగాలకు లోను కాకుండా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిజిఎం (పి. అండ్. ఏ) ఎల్ శ్రీనివాసరావు, ఉద్యోగస్తులు కార్మికులు పాల్గొన్నారు

## దాసం వెంకట్రావుకి ఘన నివాళులు



( నక్కపల్లి, ప్రభాతవార్త)

నక్కపల్లి కి చెందిన విశ్రాంతి ఉద్యోగం దాసం వెంకట్రావు ప్రథమ వర్థంతి సందర్భంగా రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీసం రామకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఒక మండల పరిషత్ ఉద్యోగ పనిచేస్తూ గ్రామంలో అనేకమైన కార్యక్రమాలకు పెద్దగా ఉండే వారన్నారు. నివాళులు అర్పించిన వారిలో భీమా కోటీశ్వరుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కక్కిరాల సురేష్ ,డ్రైవర్ శీను, కోరుకొండ వరహాల రావు, కుమారుడు వెంకటాద్రి, నక్కపల్లి కి చెందిన మాస్టర్ ఉన్నారు.

## ప్లాస్టిక్ వాడొద్దు.. క్యాన్సర్ బారిన పడొద్దు..!

### స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, ఎండిఓ, తాసిల్దార్ పిలుపు..!

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దు-క్యాన్సర్ బారిన పడొద్దని ఈ విషయం ఒకరికి ఒకరు చర్చించుకుని నిర్మూలనకు ప్రతి చెయ్యి కలపాలని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎండిఓ దెందుకూరి సీతారామరాజు ,తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి లు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛాంధ్ర అజెండాలో భాగంగా శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఓ సారధ్యంలో పలు కార్యక్రమాలు మూడో శనివారం లో భాగంగా నిర్వహించారు. మండల స్థాయిలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, భాగస్వామ్యమై సామూహికంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం అవుతామని ఎండిఓ దెందుకూరి సీతారామరాజు అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియపరచాలని, వాటి వినియోగాన్ని తగ్గించేందుకు గాను ఇంటింటికి అవగాహన కల్పించి వాటి ఆవశ్యకత పైన పలు విషయాలు తెలియజేయాలని తాసిల్దార్ నరసింహుమూర్తి పేర్కొన్నారు. వస్త్రంతో లేదా నారతో తయారు చేసిన బ్యాగులను ఉపయోగించాలని కోరారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని ఆసుపత్రి సూపర్డెంట్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు చేసే ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకోవాలని, భాగస్వామ్యం కావాలని ప్రత్యేక అధికారి ప్రసాద్ పిలుపునిచ్చారు.ప్లాస్టిక్ వస్తువులకు బదులు ఇతర ప్రత్యామ్నాయాలను వాడాలని, నామోషి అనుకోకుండా ప్రతి ఒక్కరూ నార లేదా వస్త్రంతో తయారు చేసిన బ్యాగులను వాడాలని దెందుకూరి సూచించారు. ప్రతి ఇంటి నుంచీ మార్పు ప్రారంభంకావాల్సి ఉందని చెబుతూ మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ సారధ్యంలో ఎండిఓ దెందుకూరి సీతారామరాజు ఆధ్వర్యంలో నక్కపల్లి పంచాయతీ కార్యదర్శి మూర్తి తో పాటు అన్ని విభాగాలకు చెందిన ప్రతి ఒక్కరు శనివారం ఉదయం 6 గంటలకు వీధిలో ఉన్న చెత్తను తొలగించి కార్యాలయాలను శుభ్రం చేశారు. మండల స్థాయి అధికారులు నేరుగా చీపుర్లు పట్టుకొని రహదారులపై చెత్తను తుడుస్తూ తొలగించారు. పలుచోట్ల ర్యాలీలు, ప్రతిజ్ఞ నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి కార్యక్రమాలను మొదలుపెట్టారు. పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించారు. ఇందులో భాగంగా షాప్ యజమానులకు కాలనీలో ఉన్న ప్రతి ఒక్కరికి చెత్త టబ్బు ను ఏర్పాటు చేసుకొని చెత్తను వేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఎంఈఓ నరేష్, వి. నూకరాజు, సర్పంచ్ నేతల జయ రత్నకుమారి, వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు, గ్రామీణ ఉపాధ పథకం ఏపీఓ భాగ్యలక్ష్మి, వెలుగు రాజు, డిటి లు అన్నాజీరావు, నారాయణరావు, సర్వేర్ సత్తిబాబు, ఆర్ఐ కన్నబాబు, పలువురు విఆర్వోలు వి. కామరాజు తోపాటు సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు దుర్గారాణి, జయ, వైద్య సిబ్బంది రూన్సీ లతోపాటు పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## కార్యాలయాలను శుభ్రం చేస్తున్న అధికారులు



**(నక్కపల్లి, ప్రభాతవార్త)** స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ దెందుకూరు సీతారామరాజు తో పాటు మండల స్థాయి సిబ్బంది చెత్తను తొలగించారు. చీపుర్లు పట్టుకొని శుభ్రం చేశారు. సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మూర్తి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్ ఎమ్మెల్యే పల్లా



గాజువాక,మార్చి15,ప్రభాతవార్త :

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత,మత సామరస్యానికి ప్రతీక అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గాజువాక కణితి రోడ్డులోని మాదీన మసీదు,మదీన యూత్ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలు ఐక్యతకు మారుపేరని అన్నారు. గాజువాక ప్రాంతంలో షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి భక్తి భావాన్ని చాటుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి,చింతలపూడి వెంకట్రామయ్య,గాజువాక సిఐ పార్థసారథి,మైనార్టీ నాయకులు ఐ హెచ్ ఫారుకి,ముస్లిం పెద్దలు రజీవుల్లా,షౌకత్ అలీ, ఆరీఫ్,పీర్ బాబా,మునవర్,మిస్కిన్,సలీమ్,ఆసీఫ్,అన్ని మసీదుల పెద్దలు,మదీనా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## హనుమంతువాక హైవే రోడ్ లో బోల్తాపడ్డ కారు



ఆరిలోవ, మార్చి 15, ప్రభాతవార్త

హనుమంతువాక హైవే రోడ్డులో శనివారం ఉదయం కారు బోల్తా పడింది. ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... హనుమంతువాక నుండి వెంకోజీపాలెం వెళ్లే హైవే రోడ్ లో వెళ్తున్న కారును టిప్పర్ లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తి చిన్నపాటి గాయాలతో బయట పడటం తో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా సుమారు రెండు కిలోమీటర్లు వరకు ట్రాఫిక్ జామ్ అయింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సరి చేశారు.

## శ్రీరాంపురం, వెంకటనగరంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన




పాయకరావుపేట రూరల్, ప్రభాతవార్త, మార్చి 15 :

మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, నష్టాలపై స్థానికులకు అవగాహన కల్పించామని పంచాయతీ కార్యదర్శి వై వి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఈ రెండు గ్రామాల్లోనూ ముమ్మరంగా పరిశుధ్య పనులు చేపట్టామన్నారు. తడి చెత్త–పొడి చెత్త వేరు చేసే విధానం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు అందించామని కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ, వెలుగు సిబ్బంది, హరిత రాయబారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీతం ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర - క్లీన్ ఆంధ్ర




మాధవధార :మార్చ్ 15

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ ఎస్ ఎస్ ) యూనిట్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – క్లీన్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులు వాలంటీర్లుగా కలిసి కళాశాల ప్రాంగణంలో శుభ్రత పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సేకరించిన చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం క్లీన్ అప్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాలు శుభ్రత పనులు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ఈరోజు కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛత శుభ్రత పనులు చేపట్టడం జరిగిందన్నారు. సీతమ్ డైరెక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అంకితభావాన్ని ప్రశంసిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా,పచ్చదనంతో తీర్చిదిద్దడంలో తమ కృషిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ప్రతి ఒక్కరికి పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణ పై అవగాహనను కల్పించి ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆనందపురం మండల సర్వసభ్య సమావేశం

ఆనందపురం, మార్చి 15, ప్రభాతవార్త



ఆనందపురం మండల ప్రజా పరిషత్ సమావేశం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన జరిగింది. ఆ సమావేశంలో వ్యవసాయం, విద్య, రెవెన్యూ, హౌసింగ్, ఆరోగ్యం, పశు సంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయత్ రాజ్ శాఖల పనితీరు పై సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రతినిదులు సభ దృష్టికి తీసుకొని వచ్చిన సమస్యలు ఆయా శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీడీవో వి. జానకి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

### 134 పరీక్షా కేంద్రాల్లో 29,927 మంది పరీక్షలు రాయనున్న విద్యార్థులు

### జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్

ఆరిలోవ, మార్చి 15, ప్రభాతవార్త




ఈనెల 17 నుంచి 31 లేదా వచ్చే నెల ఒకటో తేదీ వరకు జిల్లాలో 134 పరీక్ష కేంద్రాల్లో 29,927 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17 నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు కొనసాగుతాయని,

జిల్లా నుండి 29927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, వీరిలో 28523 మంది విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులు, 1404 మంది విద్యార్థులు ప్రైవేట్ అభ్యర్థులుగా ఎస్ ఎస్ సి పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. 2124 మంది విద్యార్థులు ఒకేషనల్ ట్రేడ్లో పరీక్షలో రాయనున్నారని తెలిపారు. 28523 మంది రెగ్యులర్ విద్యార్థులలో 15,094 మంది బాలురు అదేవిధంగా 13429 మంది బాలికలు హాజరు కానున్నారని తెలిపారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు వారి హాల్ టికెట్స్ చూపిస్తే ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్స్ మరియు పరీక్ష డ్యూటీ కి సంబంధించిన వ్యక్తిగత వ్యక్తులందరికీ ఎలాంటి ఎలక్ట్రికల్ వస్తువులు మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్ పరీక్ష కేంద్రానికి తీసుకురావద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రశ్నా పత్రాలలో ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, మెడికల్ క్యాంపు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. 134 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ లో అమలు చేయసామని, పరీక్షా కేంద్రాల దగ్గరలో జెరాక్స్ సెంటర్లో పరీక్ష సమయంలో మూసివేయాలని తెలిపారు. మాస్ కాఫింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామని తెలిపారు.

## శాంతి, అభివృద్ధి జాతీయ సమావేశానికి నరవ ప్రకాశ రావు



జగదాంబ మార్చి 15 ప్రభాతవార్త

మత సామరస్యానికి కృషి చేస్తున్న జాతీయ సంస్థ యునైటెడ్ రిలీజియన్స్ ఇనిషియెటివ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో కేంద్ర పాలిత రాష్ట్ర ముపుదుచెర్రిలో శాంతి అభివృద్ధి అంశం పై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో పలు రాష్ట్రాల నుంచి ప్రతి నిధులు పాల్గొన నున్నారు, ఈ జాతీయ సదస్సుకు హాజరు కావలసిందిగా యుఆర్ఐ రాష్ట్ర ప్రతినిధి, విశాఖ విద్యా సామాజిక వేత్త నరవ ప్రకాశ రావు కి ఆహ్వానం అందింది. నరవ ప్రకాశ రావు శాంతి తోనే అభివృద్ధి అంశం పై వ్యాసాన్ని సమర్పిస్తారు. నరవ ప్రకాశ రావు, ఏ.వి యెన్ కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్, రాష్ట్ర కన్వీనర్ గా వ్యవహరిస్తూ నగరంలో అనేక స్వచ్ఛంద సంస్థలతో కలసి పనిచేస్తున్నారు .

## 13వ వార్డులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

ఆరిలోవ, మార్చి 15, ప్రభాతవార్త




'స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర 'లో కార్యక్రమంలో భాగంగా 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం–పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి' అనే థీమ్‌తో ఆరిలోవ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ నుండి దుర్గ బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గుడ్డ సంచులను వాడాలని , అలాగనే ప్లాస్టిక్ వాడకం క్యాన్సర్ కారణమని ప్రతి ఒక్కరు కూడా ప్లాస్టిక్ వినియోగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తురకపూడి బాలస్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు, జీవీఎంసీ సూపర్వైజర్లు, సచివాలయం సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు

## సాంప్రదాయ మత్స్యకారుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యం




సాంప్రదాయ మత్స్యకారుల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యంగా CONFEDERATION OF FREE TRADE UNIONS OF INDIA (CFTUI%) కృషి చేస్తుందని యూనియన్ జాతీయ అధ్యక్షులు ఎన్. కనకారావు తెలిపారు. విశాఖ బీచ్ రోడ్ లోని వై ఎం సి ఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, విధానాలలో భాగంగా, భారత ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సాగరమాల, బ్లూ ఎకానమీ, కోస్టల్ రెగ్యులేషన్ జోన్, టూరణం తదితర ప్రాజెక్టులు అమలు చేస్తున్నాయని, దీని ఫలితంగా సముద్ర తీర ప్రాంతంలో నివసిస్తున్న సాంప్రదాయ మత్స్యకారులు క్రమ క్రమంగా తమ జీవనోపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సాంప్రదాయ మత్స్యకారులు అనేక రకాలుగా దోపిడి పీడనకు గురౌతున్నారన్నారు. వీరని తమ గ్రామాల నుండి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలించటం వలన, తమ నివాసాలు, గుర్తింపు, చివరకు తమ ఆత్మ గౌరవాన్ని కూడా కోల్పోతున్నారని, దీనిని అవకాశంగా తీసుకొని కొన్ని ఏజెన్సీల నుంచి వేతనాలు, సామాజిక, సంక్షేమ భద్రత పథకాలు అందిస్తామని ఈ మత్స్యకారులును మభ్యపెట్టి, దేశంలోని ఇతర ప్రాంతాలకు, ఇతర దేశాలకు చట్ట వ్యతిరేకంగా మానవ ఆక్రమ రవాణా చేయటానికి అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని CFTUI యూనియన్ ప్రతినిధి బృందాలు గత రెండు ఏళ్లలో 100 గ్రామాలు సందర్శించింది. సాంప్రదాయ మత్స్యకారులను సంఘటిత పరచి, వారిని భాగస్వామ్యులని చేసి అవగాహన సదస్సులు, నిర్వహించటంతో పాటు, చట్టబద్ధమైన వలస విధానాలు, వలనదారులు తీసుకోవలసినులు ఐక్యరాజ్యసమితి నిబంధనల ప్రకారం వలస కార్మికుల హక్కులు, వ్యస్థలానికి తిరిగి వచ్చినప్పుడు జాగ్రత్తలు, క్షమాబిక్ష చట్టాలు, వలసదారుల బీమా పథకాలు, విదేశాలలో మరణం సంభవిస్తే నిర్వహించవలసిన విధానాలు, పరిహారం యొక్క సమాచారం మరియు APNRTS వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణి చేస్తూ, సాంప్రదాయ మత్స్యకారుల సంక్షేమం, అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నామని చెప్పారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి



గాజువాక,మార్చి 15,ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని 65వ వార్డ్ కార్పొరేటర్ బొద్దు నరసింహ పాత్రుడు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గాజువాక వికాస్ నగర్ న్యూ ఐటీఐ ప్రాంగణంలో 65 వ వార్డు కార్పొరేటర్ బొద్దు నరసింహ పాత్రుడు మొక్కలు నాటారు. అంతకు ముందు అధ్యాపక సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణకు గాను ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కాలుష్యం నుంచి బయట పడటానికి గాను ప్రతి ఇంటా ముక్కలు నాటాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్,జగదీష్,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో బాలికపై అత్యాచారయత్నం

### నిందుతుడుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన గాజువాక పోలీసులు

గాజువాక,మార్చి 15,ప్రభాతవార్త:

అభం శుభం తెలియని ఓ మైనర్ బాలిక పై కామాంధుడు కన్నెసాడు. ఎవరు లేని సమయం చూసి చెర పట్టాలని ప్రయత్నించాడు. ప్రతిగటించేందుకు ప్రయత్నించిన బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించి శరీరకంగా హింసించాడు. బాలిక కేకలు వేయడంతో నిందుతుడు పరారు అయ్యేందుకు ప్రయత్నించగా పోలీసుల వలకు చిక్కాడు. సభ్య సమాజం తలదించుకునే ఈ సంఘటన గాజువాక పోలిస్టేషన్ పరిధి డ్రైవర్స్ కాలనీ లో చోటు చేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న పదేళ్ల బాలికపై ఇంటి ఎదురుగ నివాసం ఉంటున్న దాడి భాను ప్రకాష్ అనే వ్యక్తి కన్నెసాడు. ఇంట్లో బాలిక తల్లితండ్రులు లేని సమయంలో బాలిక దగ్గరకు వెళ్లి ఏదో కావాలని అడిగి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అత్యాచారయత్నం చేశాడు. శరీరకంగా హింసించాడు. దింతో భయాందోళన కు గురైన బాలిక కేకలు వేయడంతో నిందుతుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో మద్యం మత్తులో ఈ దారుణానికి ఒడిగడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలిక జరిగిన ఘటన గురించి చెప్పింది. దింతో తల్లిదండ్రుల గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భాను ప్రకాష్ ని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. గాజువాక సిఐ పార్థసారథి ఆదేశాలమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గాజువాక ఎస్ఐ లెంక సూర్యకళ తెలిపారు.

## పరిసరాలు పారి శుభ్రంగా ఉంచుదాం ఆరోగ్యం గా ఉందాం సర్పంచ్, పాంగి. పాండురంగస్వామి.....

ముంచంగిపుట్టు మార్చి 15,(ప్రభాతవార్త)::



పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే భవిష్యత్తులో గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలంలో దారెల పంచాయితీ గ్రామం లో శనివారం స్వచ్ఛంద స్వచ్ఛ వికాస్ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో దారెల సర్పంచ్ పాంగి .పాండురంగస్వామి మాట్లాడు ప్రజా ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ వికాస్ కార్యక్రమం చేపట్టడం వల్ల ప్రతి వీధి ప్రతి గ్రామం పరిశుభ్రం గా ఉన్నపుడు ప్రతి ఒక్కరు ఆరోగ్యం గా ఉంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర గా ఉండాలనదే కూటమి ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. మానవ జీవితానికి అస్తి అంతస్తు కన్నా ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేయడం వల్ల ప్రజలకు మేలు జరుగు తుందని ప్రతి ఒక్కరు చేతులు పరిశుభ్రంగా కడుకోవాలిని చెత్త తగ్గించు ప్రకృతి ని రక్షించు ,ప్లాస్టిక్ వాడకం వద్దు బంగారు భవిషతే ముద్దు అని, స్వచ్ఛ్ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్రాని, ప్రతి ఒక్కరు ఆరోగ్యం గా ఉండాలనదే ప్రభుత్వం యొక్క ఆలోచన అని సర్పంచ్ పాండురంగస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారి గిరీష్ , ఉపాధ్యాయులు కూడా . శ్రీనివాసమూర్తి, శరరెడ్డి. కోటిబాబు , సచివాలయ సిబంది భాగ్య, చందు, టీడీపీ నాయకులు కిల్లో లైకోన్, చవిత్య .గోపాలం ,నగేష్ ,పంపా .దానిష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజా ప్రతినిధులు....



ఎటపాక: మార్చి 15 ( ప్రభాత వార్త):

ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బుద్ధా ఆదినారాయణ గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి అధికారులు అధికారులు కలిసి స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర గురించి ప్రతిజ్ఞ చేసి అనంతరం ర్యాలీగా నిర్వహించి ప్లాస్టిక్ కవర్ వాడకు – ప్రాణాలు తీయకు , ప్లాస్టిక్ కవర్ వద్దు – కాటన్ సంచి ముద్దు, ప్లాస్టిక్ నిషేధిద్దాం – ప్రపంచాన్ని సంరక్షిద్దాం, చెత్త ఉంటే పెంట – తీసేస్తే పంట, రోడ్లపై చెత్త వేయకు – పర్యావరణాన్ని పాడు చేయకు, వంటి నినాదాలతో పురుషోత్త పట్నంలో గ్రామం లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ ,అంగన్వాడీ పరిసర ప్రాంతాలు స్కూల్ పరిసర ప్రాంతాలలో చెత్తను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు,ఉపాధ్యాయులు ప్రసాద్, వెంకటరమణ, అంగన్వాడి ఆశా, వెలుగు, వైద్య సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మర్రిపాలెంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం

కొయ్యూరు మార్చి 15 ప్రభాతవార్త



మండలంలోని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధ వినియోగదారుని హక్కుల గురించి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వికేటి మహాలక్ష్మి వినియోగదారుల హక్కుల యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు బి. శేఖర్ కన్స్యూమర్స్ రైట్స్ డే 2025 థీమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.మంగమ్మ, బి. కుమారి,శ్రీవిద్య, డి.రాజుబాబు, శ్రీమన్నారాయణ, డి శ్రీనివాసరావు, వెంకటరమణ, సౌమిత్రి, భువనేశ్వరి, రమణమ్మ అలాగే పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

## 18న ఆశీల వేలంపాట

డుంబ్రిగుడ, రూరల్, మార్చి15ప్రభాత వార్త:

అరకు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శుక్రవారం జరిగే సంత ఆశీల వసూలుకు ఈనెల 18న వేలంపాట నిర్వహించనున్నామని ఆ పంచాయతీ కార్యదర్శి గుణలక్ష్మి తెలిపారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు సంత ఆశీల వేలంపాటకు తీర్మాణం చేయడం జరిగిందని చెప్పారు. వేలంపాటలో పాల్గొనే అభ్యర్థులు రూ.2వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 18న రెండు గంటల వరకు వేలంపాటకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

## ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకుందాం

డుంబ్రిగుడ, రూరల్, మార్చి15ప్రభాత వార్త:



యుక్త వయస్సులోనే నాణ్యతతో కూడిన పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని కిలోగుడ ఆంగ్ల మాధ్యమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. విద్యార్థినిలతో కిశోరివికాసం పేరు ఆకారంలో పాఠశాల ఆవరణలో కూర్చొబెట్టారు. అనంతరం పోషకాహారం, ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. విద్యార్థుల పరిరక్షణకు సబీ గ్రూపులను ఏర్పాటు చేయించారు. అనంతరం కిల్లోగుడ అంగన్వాడీ కేంద్రంలో ఆ పంచాయతీ సర్పంచి తౌడమ్మ సమక్షంలో స్వచ్ఛత హీ సేవా, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ప్రధానోపాధ్యాయిని కళావతి, ఉపాధ్యాయుడు రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### చెత్తకు దూరంగా ఉందాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం :ఎంపీపీ,ఎంపీడీవో



గూడెంకొత్తవీధి మార్చి 15 ప్రభాతవార్త :

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా అందరూ అలవర్చుకోవాలని ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం జీకేవీధి మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు అవగాహనతో బాధ్యత కలిగి ఉండాలని పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ వీలు పడుతుందని ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగంపై పూర్తిగా అవగాహన కలిగి ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని సూచించారు. కార్యాలయాల చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి విద్యార్థులతో ర్యాలీ చేపట్టి పరిశుభ్రత ప్లాస్టిక్ నిషేధం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ రాజేశ్వరి, సిడిపిఓ లక్ష్మీదేవి, ఏపీవో చల్లంగి రాంప్రసాద్, హౌసింగ్ ఏఈ సెగ్గె సూరిబాబు, వ్యవసాయ శాఖ అధికారి మధుసూదన్ రావు, రెవెన్యూ శాఖ డిటి, కూటమి నాయకులు అన్ని కార్యాలయాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో శక్తి బృందం ప్రారంభం.

### మహిళల భద్రతకు మరింత పటిష్టత.

### చింతపల్లి అదనపు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నవ జ్యోతి మిశ్రా.

చింతపల్లి మార్చి 15 ప్రభాతవార్త.



మండలంలోని మహిళల రక్షణ మరియు భద్రతను కాపాడడంలో భాగంగా చింతపల్లి సబ్ డివిజన్ లో శక్తి బృందం అధికారికంగా ప్రారంభించడం జరిగిందని చింతపల్లి డివిజన్ అదనపు సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ నవజ్యోతి మిశ్రా తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రత్యేక ప్ పోలీసింగ్ ద్వారా అత్యవసర స్పందన మరియు సహాయాన్ని తొందరగా అందించడమే ఈ లక్ష్యం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి శక్తి యాప్ ముఖ్య భూమిక పోషిస్తుంది అన్నారు. దీని ద్వారా అనేక భద్రతా ప్రమాణాలు ప్రత్యేకంగా స్త్రీలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకే ఒక్కసారి బటన్ ని తాకడంతో(సింగిల్ టచ్ సింగిల్ బటన్) ఎక్కడ ఉన్న పోలీసులకు తక్షణమే సంకేతాలు వెళ్లి సహాయం కోసం సిగ్నల్ అందుతుందన్నారు. షేక్ ట్రిగ్గర్/హ్యాండ్ జేచర్ యాప్ తెరవకుండానే అత్యవసర సంకేతాలను పంపించే వీలుందన్నారు. ప్రత్యేకంగా వెంబడించడం ఆధారాల పంపినీ ఫోన్ చేసిన వారి యొక్క సమాచారం 10 సెకండ్లలో ఆడియో మరియు వీడియో రూపంలో కంట్రోల్ రూమ్ కు వెంటనే పంపించడం జరుగుతుందన్నారు. తద్వారా పోలీసులు వేగంగా స్పందించి వెంటనేచర్యలు చేపట్టే వీలుందన్నారు. శక్తి బృందం యాప్ ద్వారా ఫిర్యాదుల నమోదు, తప్పిపోయిన పిల్లల్ని నివేదిక, అక్రమ కార్యకలాపాల నివేదిక, రాత్రి ఆశ్రమాల సమాచారం, సురక్షిత ప్రయాణం వంటి వాటిని వాట్సాప్ మరియు అత్యవసర పద్ధతులు ద్వారా సంప్రదించవచ్చును అన్నారు. చింతపల్లి సబ్ డివిజన్లో శక్తి బృందం ప్రారంభించడం ద్వారా మహిళల భద్రతపై పోలీసు విభాగం కట్టుబడి ఉందని, ఆ దిశగా వారికి భరోసాని అందించడానికి రుజువు చేసిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పాజిటివ్ పోలీసింగ్ ద్వారా మహిళలకు మరింత భద్రత కల్పించడమే ధ్యేయంగా ఈ బృందం పనిచేస్తుందన్నారు. మహిళలందరూ తమ భద్రత కోసం శక్తి యాప్ ని డౌన్లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఏఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ ఎం వినోద్ బాబు, ఎస్సైలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే అందరి లక్ష్యం




రాజవొమ్మంగి, మార్చి 15, ప్రభాత వార్త

ప్లాస్టిక్ రహిత సమాజమే అందరి లక్ష్యమని మండల స్పెషల్ ఆఫీసర్ అంబేద్కర్ అన్నారు. శనివారం రాజవొమ్మంగి సచివాలయం వద్ద సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు అని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అన్నారు. ప్లాస్టిక్ లేకుండా అందరమూ కృషి చేస్తామంటూ ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, తహసీల్దారు ఏ. సత్యనారాయణ, యం. ఇ. ఓ కె. వి. వి. సత్యనారాయణ దొర, సి. డి. పి. ఓ ఎల్. దేవమణి, ఎంపిటిసి లు గొల్లపూడి పెద్దిరాజు, కనిగిరి గంగదుర్గ, ఏ. పి.ఓ రెడ్డిబాబు, ఏ. పి. యం రామాంజనేయులు, పంచాయితీ కార్యదర్శి బాలశివప్రసాద్, సుధీర్, అంగన్వాడీ వర్కర్స్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. జడ్డంగి గ్రామంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, గణజాల తాతారావు, మండల కో ఆప్షన్ సభ్యులు అడపా కామేశ్వరరావు, ఇన్ చార్జి పంచాయితీ కార్యదర్శి రొంగల కిషోర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

# పదో తరగతి విద్యార్థులు మండలానికి మంచిపేరు తీసుకు రావాలి.. సర్పంచ్ జి. రమణి



రాజవొమ్మంగి, మార్చి 15, ప్రభాతవార్త

పదోతరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించి మండలంలో ప్రధమ స్థానంలో నిలవాలని రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. శనివారం రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షలు వ్రాయనున్న విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, అట్టలను సర్పంచ్ రమణి, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో రమణి, పెద్దిరాజు, ముప్పన కేశవ్, విద్యాకమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్, జెట్టి మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బొర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు మిగిలిన విద్యార్థులు. ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు అధ్యర్యంలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు పరీక్షలకు అవసరమైన అట్టలు అందజేశారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, బొడారపు కృష్ణ, సతీష్ లు పెన్స్, ఫైల్స్. స్కేల్స్ లాంటి పరీక్ష సామాగ్రి ని అందజేశారు. ఈకార్యక్రమంలో విజయబాబు, వరప్రసాద్, ధర్మరాజు, పాపారావు, బాలరాజు, రాజుబాబు, సత్యనారాయణ, శివ, గంగన్నదొర, వార్డెన్ విశ్వనాధరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. జడ్డంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శనివారం హెచ్.ఎం. రాజు అధ్యక్షతన జరిగింది. ప్రధానోపాధ్యాయులు పి. రాజు, జె. చిన్నారావు ఎల్. సింహాద్రిరావు, సి. హెచ్. దేవుడమ్మ, పి. బాలబ్బాయి, కె. వెంకన్నదొర, ఎస్. భగవాన్ మూర్తి, ఎస్.సత్యనారాయణ, పి. పద్మావతి, బి. వసంత, విద్యార్థులు పాల్గొన్నారు.

# మా పంచాయతీలను 'అల్లూరి'లో విలీనం చేయాలి..!

## సరుగుడు, కేవీ శరభవరం, సుందరకోట గిరిజనుల అభ్యర్థన

కొయ్యూరు మార్చి15 ప్రభాతవార్త



ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, నాతవరం మండలం పరిధిలో ఉన్న గిరిజన పంచాయితీలైన సరుగుడు, కె.వి శరభవరం, సుందరకోట పంచాయతీలను అల్లూరి జిల్లాలో విలీనం చేయాలంటూ శనివారం సరుగుడు గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఈ పంచాయతీల గిరిజనులు వేడుకొన్నారు. నూరుశాతం గిరిజనులు గల తమ మూడు పంచాయతీలను అనకాపల్లి జిల్లా పరిధిలో ఉంచడం వలన, ప్రభుత్వం ఐదో షెడ్యూల్ ప్రాంతం వారికి ఇచ్చే ఎన్నో రాయితీలను తాము కోల్పోతున్నామని ఈ పంచాయతీల గిరిజనులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గిరిజన సంఘాల నేతలు, ఉన్నతాధికారులు స్పందించి విలీన ప్రక్రియకు తెరలేపాలని సరుగుడు గిరి మిత్ర సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, మరియు నర్సీపట్నం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు బండి గంగరాజు, తదితర స్థానిక నేతలు గ్రామసభలో వినతినందించారు.

# చింతూరులో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర ర్యాలీ . ప్లాస్టిక్ కవర్లను వాడరాదని వ్యాపారులకు సూచన.




చింతూరు మార్చి 15 ప్రభాతవార్త.

చింతూరు డివిజన్ కేంద్రంలో శనివారం స్వచ్ఛంద స్వర్ణాంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భారత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ర్యాలీ సందర్భంగా వ్యాపార సముదాయల వద్ద అధికారులు వ్యాపారులను ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని సూచనలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. చింతూరు తాసిల్దార్ చిరంజీవి చేతుల మీదుగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎంపీడీవో, సి డి పి ఓ విజయగౌరీ, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ బుచ్చిబాబు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు కావాలి..

## జిల్లా పరిషత్ సమావేశంలో జడ్పీటీసీ

రాజవొమ్మంగి, మార్చి 15, ప్రభాత వార్త



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జిల్లాపరిషత్ కార్యాలయంలో శనివారం బడ్జెట్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రాజవొమ్మంగి జడ్పీటీసీ వడుగుల జ్యోతి మాట్లాడుతూ గత 10 సం. లుగా అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవని , కొన్ని భవనాలు మంజూరైన అవి పునాది దశలోనే ఆగిపోయాయని అన్నారు. అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు కొనసాగు తున్నాయని సమస్యను వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు మంజూరైన వాటి యొక్క పనులు పూర్తి చేసి, ఇంకా భవనాలు లేని చోట్ల మంజూరు చేయాలని దీనిపై రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కె. సింహాచలం వెంటనే స్పందించి భవనాలన్నీ పూర్తయ్యే విధంగా ఆదేశాలు ఇస్తామని అన్నారని జడ్పీటీసీ వెల్లడించారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించాలి.

## ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పిటిసి సభ్యుడు బాలయ్య.

చింతపల్లి మార్చి 15 ప్రభాతవార్త.



స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి , పోతురాజు బాలయ్యఅన్నారు. శనివారం స్వచ్ఛంధ్ర, స్వర్ణంధ్ర కార్యక్రమాన్ని మండల పరిషత్ అధికారులు నిర్వహించారు. తొలుత మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈపోటీల్లో క్లీన్ ఇండియా. గ్రీన్ ఇండియా ముగ్గు వేసిన చింతపల్లి మహిళ కె. శ్రీలక్ష్మి ప్రథమ స్థానం, తడి, పొడి చెత్తపై ముగ్గువేసిన బైలు కించంగి అంగన్వాడీ టీచర్ మోరి తేజారాణి ద్వితీయ స్థానం, పచ్చనిచెట్లు, ప్రగతిమొట్లు ముగ్గువేసిన చింతపల్లి యువతి కె. ప్రసన్నకుమారికి తృతీయ స్థానం లభించింది. విజేతలకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి కుటుంబం గృహ పరిసరాలు, వీదులు పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. తడి, పొడి చెత్తలను గృహాల్లో భద్రపర్చి పంచాయతీ సిబ్బంది అప్పగించాలన్నారు. ప్రతి పంచాయితీల్లోనూ సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొనిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యు ఎస్ వి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి బిబివి ప్రసాద్ ,వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద. సర్పంచ్ దురియా పుష్పలత, ఏపీవో రాజు, కార్యదర్శి శ్రీదర్ పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో గిరిజన రైతు జీడితోట దగ్ధం

రాజవొమ్మంగి, మార్చి 15, ప్రభాత వార్త



గడుఒకుర్తి పంచాయితీ గొబ్బిలమడుగు గ్రామ బి. టి. రహదారి ప్రక్కనే ఉన్న చలుమర్తి వెంకటస్వామికి చెందిన అరఎకరం విస్తీర్ణంలో గల జీడిమామిడితోట ఆకస్మిక అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. కాపుదశలో కాలిపోవడం పట్ల రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఐటిడిఏ ద్వారా ఆదుకోవాలని కోరుతున్నాడు.

# పంకజ్ కుమార్ మీనా (ఏఎస్ పి)ఆధ్వర్యంలో శక్తీ టీం ప్రారంభం

మోతుగూడెం ప్రభాతవార్త మార్చి:15

మహిళలపై వేధింపులను అరికట్టేందుకుప్రతి ఒక్క మహిళా శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వారి ఆదేశాల తో చింతూరు డివిజన్ అడిషనల్ ఎస్ పి పంకజ్ కుమార్ మీనా శనివారం నాడు శక్తీ టీం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూమహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు మరియు మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించామన్నారు.మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు పార్కులు ఆర్టీసీ బస్టాండ్లు ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా పెడతామన్నారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. అదనపు ఎస్పీ నోడల్ అధికారిగా ఉన్న ఈ టీమ్స్ లో ఉమెన్ ఎస్పైనేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది నలుగురు కానిస్టేబుళ్లు మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ నకు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంనకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం తొ పనిచేస్తాయన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా సూచనలు చేశామన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించేలా టీమ్స్ తెలియజేశామన్నారు.

# అల్లూరి జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్:

పాడేరు,మార్చ్15,ప్రభాతవార్త:




ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు మరియు ఉద్యోగుల భాగస్వామ్యంతో జిల్లాలోని అన్ని గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా, చెత్త రహితంగా మరియు సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ కూడలి నుండి జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకూ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించినందున , ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఏప్రిల్ 1 వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదాన్ని పక్కగా అమలు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థములు పేరుకుపోయి, పర్యావరణానికి హానీ కలిగిస్తున్నందున ,ఏజెన్సీలో అర లీటర్, లీటర్ వాటర్ బాటిల్స్ విక్రయాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పండుగలకు, వేడుకలకు అధిక మొత్తంలో ప్లాస్టిక్ వినియోగించడం వలన పర్యావరణం కు ముప్పు కలుగుతుందని అన్నారు. ప్లాస్టిక్ నిషేదం పక్కగా అమలు చేయాలని కోరారు. డివిజనల్ పంచాయతీ అధికారి పీ.ఎస్ మార్ మాట్లాడుతూ చౌకగా లభించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వలన వ్యవసాయ భూములు, గాలి, నీరు కలుషితం అవడంతో పాటు గిరిజన ప్రాంతాల్లో కూడా కేన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు . కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, బొర్ర. నాగరాజు, కొట్టగుళ్ల సుబ్బారావు, వెలుగు పథక సంచాలకులు మురళి, స్థానిక యం.పి.డి.ఒ తేజ ,తహాసీల్దార్ త్రినాథ్, ఈఓఆర్డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక ధన్యవాదాలు..

పాడేరు,మార్చ్15,ప్రభాతవార్త




వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ కి మా వి 216%ఖ% వాసవి క్లబ్ పాడేరు హిల్స్ మా క్లబ్బు నెంబర్ అయినటువంటి ఐ సత్యారావు వాళ్ల కుమార్తె అయినటువంటి ఐతమ్ శెట్టి శ్రావణి కి పెళ్లి నిమిత్తం 25 వేల రూపాయలు ఇచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదములు అలాగే జిల్లా గవర్నర్ అయినటువంటి కొల్లూరి పార్వతి కి మరియు ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాధు శ్రీను కి మా క్లబ్ తరఫున మీకు ప్రత్యేక ధన్యవాదములు ఇట్లు వాసవి క్లబ్ పాడేరు హిల్స్ ప్రెసిడెంట్ పి సంతోష్ కుమార్ సెక్రటరీ పి రమేష్ ట్రెజరర్ ఎస్ అప్పారావు మరియు మా క్లబ్ మెంబర్స్ అందరి తరపున మీకు ప్రత్యేకమైన ధన్యవడాలు తెలిపారు.

# పెసా నూతన మండల కమిటీ ఎన్నిక.



హుకుంపేట, మార్చి 15, ప్రభాతవార్త:

పెసా మండల నూతన కమిటీ అధ్యక్షులుగా చప్పులి శంకర్రావు ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో గల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా సాగోరి అప్పలకొండ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా జన్ని వెంకటరమణ తో పాటు జాయింట్ సెక్రటరీగా శెట్టి జయరాం, కోశాధికారిగా పాడి భరత్ కుమార్ ,అధికార ప్రతినిధులుగా సొంటేని కీర్తన కార్యనిర్వాహక సభ్యులుగా కొర్ర కొండబాబు ప్రధాన సలహాదారులుగా అరుణ, వైకుంఠ రావు, మత్స్యరాజు, నాగ మణికుమారి, తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకున్న మండల పేష సభ్యులు గిరిజన హక్కులు చట్టాలు జీవో నెంబర్ 3 పునరుద్ధరణ 1/70 చట్టం రక్షణ కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# కలెక్టరేట్ లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర



పాడేరుమార్చి15,ప్రభాతవార్త:

ప్రతీ నెలా మూడవ శనివారం రోజున నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా కలెక్టరేట్ పరిసరాను శుభ్రం చేసారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత మొక్కలు నాటారు. సర్వే సహాయ సంచాయలకులు దేవేంద్రుడు, సర్వే విభాగం సిబ్బంది కార్యాలపు ఆవరణను శుభం చేసారు. అదేవిధంగా సమాచార శాఖ కార్యాలయంలో పరిశుభ్రతా పనులు చేపట్టి కార్యాలయాన్ని శుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సబ్బంది, సమాచార శాఖ, సర్వే విభాగం అధికారులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



## మాస్ కాపీయింగ్ కి పాల్పడితే కఠిన చర్యలు
## పాస్ పర్సేటేజి పెంచడానికి ప్రయత్నిస్తే ఉపేక్షించను
## జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్:

పాడేరు, మార్చి15, ప్రభాతవార్త:

ఈనెల 17 వ తేదీ నుండి జరగనున్న పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి పది పరీక్షల ఏర్పాట్లపై విద్యాశాఖ, గిరిజన సంక్షేమం, రవాణా, పబ్లిక్ ట్రాన్స్పోర్టు, విద్యుత్, పంచాయతీ అధికారులతో పదిపరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరుగుతుందని పుకార్లు వచ్చినా మాస్ కాపీయింగ్ జరిగినా మండల స్థాయి అధికారులు, సంబంధిత పాఠశాల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్విజిలేటర్లు మాస్ కాపీయింగ్ న్ను ప్రోత్సహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.పాస్ శాతాన్ని పెంచడానికి మాస్ కాపీయింగ్ జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పరీక్షలు సజావుగా జరగడానికి మండల విద్యాశాఖాధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు తగినన్ని మందులను సమకూర్చి విద్యార్థులకు అవసరమైతే వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. గిరిజన సంక్షేమ ఉపసంచాలకులతో మాట్లాడి విద్యార్థులకు కల్పిస్తున్న రవాణా, వసతి సదుపాయాలను అడిగి తెలుసు కున్నారు. జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో 71 పరీక్షా కేంద్రాలో 20 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ సెట్ 1,సెట్ 2 పరీక్షా పత్రాలు జిల్లాకు చేరాయన్నారు. పోలీస్ స్టేషన్లలో భద్రపరచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్. రజని, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, ట్రాన్స్కో ఎస్. ఇ. ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్ మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు

# అరకులోయలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ మార్చి 15 ప్రభాత వార్త : –

11 కెవి అరకు అంజోడా టౌన్ ఫీడర్ న్యూ పోల్స్ వేయుట కొరకు నేడు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏవిఎన్ఎం అప్పారావు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందువలన విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు ఈ పనుల వలన మండలంలోని అరకులోయ పాణిరంగిని, ఎండపల్లి వలస, రవ్వలగూడ శరభగూడ, పద్మాపురం, అరకు విలేజ్ (సంతబయలు) ప్రాంతాలలో విద్యుత్ సరఫరాయానికి అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులందరూ సహకరించవలసిందిగా కోరారు.

# ఉప రవాణా శాఖ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్

మాధవధార :మార్చ్ 15



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు విశాఖ ఉప రవాణా శాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప రవాణా శాఖ కార్యాలయం,ప్రాంతీయ రవాణా కార్యాలయం,గంభీరంలో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ వద్ద శుభ్రత పనులు చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఉప రవాణా కమీషనర్ ఆర్.సి. హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బదులు గుడ్డ సంచులను వాడాలన్నారు. ఇందులో భాగంగా శీలానగర్,ఎయిర్ పోర్ట్, రైల్వే స్టేషన్ల వద్ద డ్రైవర్లకు,ఓనర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రమైన పచ్చదనం మరియు ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## బొండం పేసా వైస్ చైర్మన్ సుంకరి ఆనంద్ పిలుపు




అరకులోయ, మార్చి 15, ప్రభాతవార్త :–

అరకులోయ మండలం లోని బొండం లో స్వచ్ఛంద్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమం లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బొండం పేసా వైస్ చైర్మన్ సుంకరి ఆనంద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం బొండం పంచాయతీ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారం ప్రతి నెల మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించి, స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణాంధ్ర పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలిద్దామని, అందరూ సహకరించాలన్నారు. సచివాలయ సిబ్బందితో గ్రామ వాడ, వాడలా విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పరిసరాల్లో పరిశుభ్రత పై ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో డ్రైనేజీలను క్లీన్ అండ్ గ్రీన్ గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, ,ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బందిలు అంగన్వాడి సిబ్బందితో కలిసి గ్రామ పరిసరాల్లో సందర్శించారు. ఈ . కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్లోరి సుబ్బారావు పాఠశాల ఉపాధ్యాయులు,సచివాలయ, వివిధ శాఖలకు చెందిన సిబ్బందిలు, ప్రవీణ్,కమల, సంజీవ్, మహిళా పోలీస్, ఆరోగ్య అసిస్టెంట్, వెలుగు,సిబ్బందిలు, గొల్లోరి ఆనంద్, బారికి సూర్యకాంతం, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది వి ఆర్పిలు, సుంకరి ముత్యాలమ్మ, పంచాడి సుమన్,అంగన్వాడి, ఆశ వర్కర్లు పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు గొల్లోరి అప్పారావు ,బారికి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో అట్టహాసంగా 'స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర '

కొయ్యూరు మార్చి15 ప్రభాతవార్త



శనివారం మండలంలోని పలు పంచాయతీలలో స్థానిక గ్రామ సచివాలయ సిబ్బంది నేతృత్వంలో, అన్ని శాఖల సిబ్బంది పాల్గొనగా 'స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర ' కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మండలంలోని రాజేంద్రపాలెం, నడింపాలెం, శరభన్నపాలెం, అంతాడ(కొత్తపల్లి), తదితర అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనాన్ని కాపాడుకోవడం, ప్లాస్టిక్ నిషేధం వంటి వాటిని స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది స్థానికులకు వివరించారు. వేర్వేరు చోట్ల జరిగిన ఈ కార్యక్రమాల్లో గ్రామ సచివాలయాల సిబ్బందితోపాటు అన్ని శాఖల సిబ్బంది ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. రాజేంద్రపాలెంలో సర్పంచ్ పీర సింహాచలం, శరభన్నపాలెంలో సర్పంచ్ కిముడు సత్యనారాయణ, నడిం పాలెం లో టిడిపి నేత జంపా వెంకటరమణ, అంతాడ కొత్తపల్లిలో స్థానిక సర్పంచ్ సుర్ల చంద్రరావు తో పాటు టిడిపి నేతలు రీమల బాలకృష్ణ ఇలా అన్ని పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొని, కొన్నిచోట్ల ర్యాలీలు నిర్వహించారు.

# మహిళలపై వేధింపులను అరికట్టేందుకు శక్తి టీమ్స్ కృషి.

## ప్రతి ఒక్క మహిళా "శక్తి యాప్" ను డౌన్లోడ్ చేసుకోవాలి.

## చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా.




చింతూరు మార్చి 15 ప్రభాత వార్త.

చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా చేతుల మీదుగా శనివారం శక్తి టీమ్ను ప్రారంభించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్పీ పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ– మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు మరియు మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించామన్నారురాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్' ను ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా పెడతామన్నారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. అదనపు ఎస్పీ నోడల్ అధికారిగా ఉన్న ఈ టీమ్స్ లో ఉమెన్ ఎస్పైనేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ నకు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంనకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా దిశానిర్దేశం చేశారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా సూచనలు చేశామన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించేలా టీమ్స్ తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉనికిని కాపాడుకోవాలని వైసిపి నాయకుల విశ్వ ప్రయత్నం.

## యువజన పోరుకి స్పందన ఏది?

## తెలుగుదేశం అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి.

చింతపల్లి మార్చి 15 ప్రభాతవార్త.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవాలని ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రజల నుండి ఎటువంటి స్పందన రావడంలేదని తెలుగుదేశం అరకు పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి అప్పుల భారాన్ని ప్రజల మీద మోపిన వైసీపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుంటూ వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి సంక్షేమానికే ప్రజలు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రణాళికబద్ధంగా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు . అయితే వైసీపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే ధోరణిలో యువజన పోరాట కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. కేవలం అతి తక్కువ మంది పార్టీ కార్యకర్తలతో ఆందోళన చేశారన్నారు. పాడేరు జిల్లా కేంద్రం లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిరిజన యువత ఒక్కరూ కనిపించలేదన్నారు. కేవలం అతి తక్కువ మంది పార్టీ కార్యకర్తలతో ఆందోళన చేశారన్నారు. గిరిజన ప్రాంత ప్రజల్లోనూ మార్పు వస్తుందన్నారు వైసీపీని నమ్ముకుంటే అభివృద్ధి సంక్షేమానికి దూరమైపోతామనే భావనను కలిగి ఉన్నారన్నారు. టిడిపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి గిరిజనులు కూటమిపై ఆకర్షితులు అవుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా పక్కా గృహాలు మంచినీటి పథకాలు తారు రోడ్లు సిసి రోడ్లు డ్రైన్లు నిర్వహణ వంటి పనులు టిడిపి హయంలోశరవేగంగా జరుగుతున్నాయి అన్నారు. వైసీపీకి కాలం చెల్లిపోయింది అని యువజన పోరుతోనే స్పష్టత వచ్చిందని జ్ఞానేశ్వరి అన్నారు. మోసపూరిత ప్రభుత్వం నుంచి ఇప్పుడే ప్రజలు గాడిలో పడ్డారని ఆమెకితాబు ఇచ్చారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త

## పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



తెర్లాం, మార్చి 15, ప్రభాతవార్త

రేపటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాద్ రావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షల నిర్వహణ జరుగుతుదన్నారు.ఏ పి మోడల్ స్కూల్, పెరుమాలిలో 150 మంది, జిల్లా పరిషత్ స్కూల్ పెరుమలిలో 171 మంది, జిల్లా పరిషత్ హై స్కూలు తెర్లాంలో 211 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయడం జరుగుతుందన్నారు. రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 542 మంది విద్యార్థులు పరీక్షలకి హాజరు కానున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటలవరకు జరుగుతయన్నారు. ఈ పరీక్షల నిర్వహణ నిమిత్తం అన్ని కేంద్రాలలో విద్యార్థులకు బల్లలు, త్రాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్,లైటింగ్ మొదలగు సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షలు సజావుగా నిర్వహణ నిమిత్తం 144 సెక్షన్ నిమిత్తం తహశీల్దార్ వారికి, పోలీసు బందోబస్తు నిమిత్తం స్థానిక ఎస్ఐ వారికి...వినతి పత్రాలు సదరు కేంద్రాల పరీక్షల నిర్వాహకులు అందజేయడం జరిగింది. పరీక్షలు సజావుగా నిర్వహణకు వారి సహకారం అందించి గలందులకు విన్నవించడం జరిగింది. పరీక్షల నిర్వహణ అధికారులుగా జిల్లా పరిషత్ హై స్కూల్ తెర్లాం యందు గుల్లిపల్లి శ్రీనివాస్ రావు, శ్రీరామ చంద్రుడు వ్యవహరించుచున్నారు. ఏపీ మోడల్ స్కూల్ యందు ఐ.సీతారం, జి.రామకృష్ణ జిల్లా పరిషత్ హైస్కూల్, పెరుమాలి యందు ఉదయ భాస్కరరావు, ఎస్.తిరుపతిరావులు పరీక్షల నిర్వహణ నిమిత్తం నిర్వహణా అధికారులుగా నియమించారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ 2 ఆర్.పాపారావు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడు పేదల పాలిట పెన్నిది : ఎమ్మెల్యే



లక్కవరపుకోట, మార్చి 15, ప్రభాతవార్త

సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని పేదలు, ఆపదలో ఉన్నవారి అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా వేలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఆమె అన్నారు శనివారం ఎల్.కోట పార్టీ కార్యాలయములో ఎస్.కోట నియోజకవర్గంలోని 19 మంది పేదలకు 12.98 లక్షల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య చికిత్సకు పేదరికం అడ్డంకి కాకూడదని సీఎం చంద్రబాబునాయుడు సంకల్పమని పేదలు ఆరోగ్య సమస్యలతో బాధపడకుండా ప్రభుత్వ సహాయాన్ని అందించడం మా బాధ్యతగా ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యతగా ఆమె పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాం ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్ నాయుడు, చొక్కాకుల మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ కొల్లి రమణ మూర్తి మరియు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి టెన్త్ పరీక్షలు.. సర్వం సిద్ధం..



గజపతినగరం, మార్చి 15, ప్రభాతవార్త

ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలు పగడ్బందీగా చేపట్టేందుకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారిని ఎస్.విమలమ్మ శనివారం తెలిపారు. గజపతినగరం పట్టణంలోని 4 పరీక్ష కేంద్రాల్లో 690 మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 155 మంది ,బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 215 మంది, శ్రీకృష్ణ విద్యాపీట్ కేంద్రంలో 144 మంది, మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో 176 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు కానున్నట్లు తెలిపారు ఈ మేరకు శనివారం ఆమె ఈ నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటులను పరిశీలించారు. సిఎస్, డివోలకు పలు సూచనలు చేశారు.

## స్వచ్ఛంధ్ర స్వచ్ఛదివస్ అందరి బాధ్యత



రామభద్రపురం, మార్చి 15. ప్రభాతవార్త

స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఎంపిడిఓ రత్నం రామభద్రపురం మండలంలో రామభద్రపురం గ్రామంలో ప్రజలు భాగస్వామ్యంతో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లుమొక్కలు నాటుదాం పర్యావరణం కాపాడుదాం ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు. మరుగుదొడ్ల వినియోగం.పరిసరాల పరిశుభ్రత మనందరి సామాజిక బాధ్యత అని అవగాహన కల్పించి ప్రమాణం చేయించారు.. అలాగే మండల ఆఫీసు, పోలీసుస్టేషన్ పరిసరాలు పరిశుభ్రం చేశారు. రామభద్రపురం సర్పంచ్ రవ్వా ఈశ్వర్ రావు, తహశీల్దార్ ఆకుల సులోచనరాణి,ఎమ్ఇఓ తిరుమల ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బోరు ప్రైవేట్ పెత్తనం
### ప్రయాణికులకు తీరని దాహం



వేపాడ, మార్చి 15 ప్రభాతవార్త:

రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి మంచినీటి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది అయినా అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆ నిధులు సక్రమంగా వినియోగంలోకి రాకపోవడంతో మంచినీటి కోసం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఆ కోవకు చెందినదే చినగుడిపాల గ్రామానికి చెందిన మంచినీటి బోరుబావి. వేపాడ మండలం చినగుడిపాల గ్రామం శివ యూపీ పాఠశాల వద్ద మూడు రోడ్ల జంక్షన్‌లో స్థానికులు, ప్రయాణికుల సౌకర్యార్థం బోరుబావిని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ బోరు బావి ద్వారా ఎంతోమంది మంచినీటి అవసరాలు తీరేవి. అయితే కాలక్రమంలో ఈ బోరు బావి మరమ్మతులకు గురి కావడంతో మంచినీటి కోసం ఆ ప్రాంతీయులు అనేక అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో ఈ బోరుబావి పక్కనే వెల్డింగ్ వర్క్ షాప్ ఏర్పాటు కావడం, బోరుకు మరమ్మత్తులు జరిపినా వర్క్‌షాప్ యజమానులు బోరుబావికి పైకప్పు బిగించి పైపులైను ఏర్పాటు చేసి వారి సొంత అవసరాలకు వాడుకోవడంతో పరిసర ప్రాంతీయులు మంచినీటి కోసం అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావిని ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేస్తున్న ఆ రహదారి మీదిగా వెళున్న సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కనీసం పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ బోరుబావిని ప్రైవేటు వ్యక్తి చేతిలో నుంచి విడిపించి మంచినీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు పలు గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

## ఆర్కే అబాకస్ పరీక్షలో గ్లోబల్ పాఠశాలకు జిల్లా ఫస్ట్, థర్డ్




గుర్ల, మార్చి 15, ప్రభాతవార్త

గుజ్జంగివలస గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో (ఆర్కే అబాకస్) పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర బలల హక్కుల పరిక్షణ కమీషన్ చైర్మన్ విద్యార్థులను అభినందించారు. ఈ మేరకు విద్యార్దులకు ఒకటో తరగతి చదువు తున్న విద్యార్థి. హేమంత్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించగా ఐదవతరగతి చదువుతున్న హర్షవర్ధన్ మూడవ స్థానం సాధించారు.శనివారం స్కూల్లో జరిగిన అభినందన సభలో చైర్మన్ కేశలి అప్పారు.కరస్పాండెంట్ రెడ్డి మురళీధర్ రావు తదితరులు మెమొంటోస్,సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలియజేశారు.

## స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివాస్ అందరి బాధ్యత : ఐటిడిఏ పీఓ

సాలూరు, మార్చి 15, ప్రభాతవార్త



సాలూరు పురపాలిక సంఘం అధికారులు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు నీడ్ స్వచ్ఛంద సంస్థ ఇంకా మెప్మా పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వ చ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ప్రోగ్రాం లో భాగంగా ర్యాలీ నిర్వ హించి అవగాహన కల్పించారు. శనివారం ఉదయం నిర్వహిచిన ఈ కార్యక్రమానికి ఐటిడిఏ పిఓ అశుతోష్ శ్రీ వాత్సవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ సంకల్పంతో మున్సి పాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రజలకు పరిశుభ్రత గురిం చి అవగాహన కల్పించాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్‌లో అందరూ భాగస్వాములు కావాలని అధికారుల, సిబ్బందితో ప్రమాణం చేయించారు. ఎంపీ డీవో గొల్లపల్లి పార్వతి, ఇన్‌చార్జ్ కమీషనర్ ప్రసాద్, మేనేజర్, టీపిఓ, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజీవ్, నీడ్ వేణు, ఏపి ఓ రామకృష్ణ,మెప్మా సీఎంఎం పుష్పా, ఆర్పీలు,మున్సి పల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛంధ్ర స్వచ్ఛదివస్ మనందరి బాధ్యత : జిల్లా స్పెషల్ ఆఫీసర్



బలిజిపేట, మార్చి 15, ప్రభాతవార్త :

బలిజిపేట మండలం గ్రామ సచివాలయంలో శనివారం పార్వతీపురం మన్యం జిల్లా స్పెషల్ ఆఫీసర్ డి.రాబర్ట్‌పాల్ అధ్యక్షతన స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివస్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం సచివాలయంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములో ఎటువంటి ప్లాస్టిక్ సంచులను ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దు అని హెచ్చరించారు, వ్యాపారులకు నోటీసులు ఇచ్చి ఖచ్చితంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అందరూ ముందుకొస్తే ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమాన్ని విజయవంతం చేయవచ్చని పిలుపునిచ్చారు గ్రామంలో ప్రజలకు ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఆదేశాలు అధికారులందరికీ జారీ చేయడం జరిగిందనానరు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఎంపిడిఓ, ఈవోపిఆర్డి,. వైస్ ఎంపిపి, వైస్ సర్పంచ్, ఏపివో ఏవో, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి..



చీపురుపల్లి, మార్చి 15 ప్రభాతవార్త

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించి కాలుష్యాన్ని నివారించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇప్పలవలస సురేష్ అన్నారు. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం నేరంగా పరిగణించబడుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కేసులు నమోదు చేయబడుతుంది అన్నారు. అనంతరం మూడు రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మూడురోడ్ల జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నియంత్రణపై పలు నినాదాలు చేశారు.. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సర్పంచ్ సుధారాణి ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి. తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామ నాయుడు ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు. మహిళా ప్రతినిధి హారతి సాహూ, గద్దె అనురాగ్ కోట్ల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ లక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సూపర్వైజర్ నాసిక రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత



దత్తిరాజేరు, మార్చి 15, ప్రభాతవార్త

ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణం మన అందరి బాధ్యతని ఎంపీడీవో వైవి రాజేంద్రప్రసాద్ తాసిల్దార్ విజయభాస్కర్ అన్నారు శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర అనే కార్యక్రమం ద్వారా ప్రతిజ్ఞ చేసి మండల పరిషత్ కార్యాలయం నుండి వెలుగు సమాఖ్య భవనం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. మనం విచ్చలవిడిగా వాడి పారేసి ప్లాస్టిక్ కవర్లు పర్యావరణాన్ని నాశనం చేస్తుందన్నారు. మన పరిసరాలు చుట్టూ పరిశుభ్రత ఉంచే బాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి ఇల్లు ప్రతి వీధి శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ గోవింద్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 20 టన్నుల టైప్ టు ఘనజీవమృతం తయారీ



పాచిపెంట, మార్చి 15, ప్రభాతవార్త

మండలంలో ఇప్పటివరకు 11 మంది రైతులుతో 20 టన్నుల టైప్ టు ఘన జీవామృతం తయారు చేయటం జరిగిందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంట గెత్తము కుప్పలు ఉన్న రైతులందరూ 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకుని ఒక టన్ను పశువుల పెంటలో కలుపుకుని పొలంలో ఆఖరి దుక్కిలో వేసుకున్నట్లయితే నేల అత్యంత సారవంతంగా మారుతుందని పంటకు కావలసిన సూక్ష్మ, స్థూల పోషకాలను అందిస్తుందని భూమిలో జీవ వైవిధ్యము పెరిగి వానపాముల వృద్ధి జరగడం వలన నీటి తేమ శాతాన్ని నిలుపుకునే శక్తి పెరుగుతుందని అలాగే భూసారముగా పిలవబడే సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని తెలిపారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తూ నాడెపు కంపోస్ట్ గుంతలలో కేవలం పశు మరియు వృక్ష వ్యర్ధాలను మాత్రమే వేయాలని ప్లాస్టిక్ మరియు పాలిథిన్ ఎట్టి పరిస్థితులలో వేయకూడదని దీనివలన పశువుల పెంటలో ఉపయోగపడే జీవ వైవిధ్యం నశించిపోతుందని తద్వారా తయారుచేసిన ఎరువు పంటకు ఉపయోగపడకుండా పోతుందని కాబట్టి రైతులు కేవలం చివికిన పసు మరియు వృక్ష వ్యర్థాలను మాత్రమే నాడెపు గుంతలలో వేయాలని సూచించారు. పేడను చివికిన ఆకులు రొట్ట వంటి వాటిని ఈ కంపోస్టు గుంతలో వేసుకుంటే సారవంతమైన ఎరువు తయారవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ కుమార్ అనిల్ కుమార్ ప్రకృతి సేద్య యల్ వన్ తిరుపతి నాయుడు రైతులు పాల్గొన్నారు.

## పశువైద్య విద్యార్థులు ర్యాలీ, ధర్నా

గరివిడి మార్చి, 15 ప్రభాతవార్త :




స్టైఫండ్ పెంచాలని కోరుతూ స్థానిక పశువైద్య విద్యార్థులు గత రెండు నెలలు గా చేపట్టిన నిరాహారదీక్ష ల్లో భాగంగా శనివారం గరివిడి లో ర్యాలీ అనంతరం ధర్నా చేసి తమ నిరశన వెళ్లగక్కారు. నిరశన దీక్ష శిబిరం నుండి గరివిడి సినిమా హాలు వరకు ర్యాలీ చేసిన నిరశన కారులైన విద్యార్థులు స్టైఫండ్ పెంచాలని నినదించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసి తమ నిరశన గళం విప్పారు. పోలీసులు విద్యార్థులకు నచ్చచెప్పి విద్యార్థులతో ఆందోళన విరమింప జేశారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం
### ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు




నెల్లిమర్ల, మార్చి 15 ప్రభాతవార్త :

పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజక వర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. నెల్లిమర్లలో నగర పంచాయతీ కమీషనర్ కె.అప్పల రాజు ఆధ్వర్యంలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి బంగార్రాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మెప్మా మహిళలు, ఉద్యోగులుతో కలిసి నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే రోడ్డును పరిశుభ్రం చేసే కార్యక్రమంలో బంగార్రాజు నేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే రాష్ట్రంలోకూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందువల్లనే పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాదాన్యం ఇస్తున్నదని అన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని,నగర పంచాయితీ కమీషనర్ కె.అప్పలరాజు, టిడిపి జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నగర పంచాయితీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, టిడిపి నాయకుడు, కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, ముడిమంచి లక్ష్మణరావు, కలిశెట్టి కన్నంనాయుడు, మజ్జి ఆదినారాయణ, మెప్మా సిఎంఎం దన్నాన గోవిందరావు ,ఆర్‌పిలు, మహిళలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



లక్కవరపుకోట, మార్చి 15 ప్రభాతవార్త

సైబర్ నేరాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అపరిచితులకి మీ బ్యాంకు సమాచారం ఏ టి ఎం సమాచారం వంటివి ఫోన్ ద్వారా అడిగినా నేరుగా అడిగా చెప్పకూడదు అని ఎల్ కోట ఎస్ ఐ నవీన్ పడాల్ ప్రజలకు సూచించారు శనివారం గంగుబూడి గ్రామంలో ఎస్ ఐ సైబర్ క్రైం పై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. కొందరు మోసగాళ్లు అమాయకుల్ని టార్గెట్ చేసి వారి అకౌంట్లోని నగదు కాజేసేందుకు వివిధ రూపాలలో ప్రయత్నిస్తున్నారని ఫోన్ పే ను ఇతర ఆన్ లైన్ ఫ్లాట్ ఫార్మ్ ని వాడుకునే వారి సమాచారాన్ని సేకరించి ఫేక్ మెస్సేజెస్ ద్వారా డబ్బును ఆస చూపి మొత్తం అకౌంట్‌లో డబ్బులు కాజేస్తున్నారని అందుకే ప్రతి చోట అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ మధ్య మీకు వచ్చిన పార్సెల్ లో లేదా మీకు సంబందించిన వాహనాలలో స్మగ్లింగ్ జరిగినట్లు కేసు నమోదు అయ్యిందని కేసు మాఫి కావాలంటే డబ్బులు కట్టాలని ఇలా అనేక రకాల మోసాలు జరుగుతున్నాయని వీటిని మీరు నమ్మవద్దని మీకు ఎటువంటి మెస్సేజెస్ బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించవద్దని అవసరం అయితే దగ్గరలోని పోలీస్ స్టేషన్ కి వెళ్లి విషయం చెప్పొచ్చని మీ అకౌంట్ వున్నా బ్యాంకు కి వెళ్లి మీ అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు

## మండలంలో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు



మక్కువ మార్చి 15 ప్రభాతవార్త

మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం తహశీల్దారు షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో డిడి స్వరూప రాణి వారి కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఎంపీడీవో ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లలో వర్మీ కంపోస్టు తయారీకి అవసరమగ ఎర్రలను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మండల ప్రజా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి.. ఎంపీపీ

బొబ్బిలి మార్చ్ 15 ప్రభాతవార్త :

మండలంలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి చర్యలు చేపట్టాలని బొబ్బిలి మండల పరిషత్ అధ్యక్షురాలు సంపంగి లక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమం ఎంపీడీవో రవికుమార్ ఇతర మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. అగ్రికల్చర్ ఏడి శ్యాంసుందర్, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొని సమస్యలపై క్రుణంగా చర్చించారు.

## మున్సిపల్ అధికారుల హామీతో సమ్మె సుఖాంతం

సాలూరు, మార్చి 15 ప్రభాతవార్త :



సాలూరు మున్సిపల్ కార్మికులు గత ఐదు రోజులుగా బకాయి పడిన జీతాలు కోసం అలాగే సమస్యలు పరి ష్కరించాలని సమ్మె చేపట్టడంతో మున్సిపల్ అధికారులు వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. శనివారం ఉదయం ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాద్, మేనేజర్ శివప్రసాద్, టిపిఓ ఝాన్సీ అలాగే ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ రాజీవ్ కార్మి కులు చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు వెళ్లి యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం ఇంచార్జ్ కమిషనర్ మాట్లాడుతూ బకాయి పడిన జీతాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని అలాగే సమస్యలన్నీ పరిష్కరిస్తామని పత్రిక, మీడియా ముఖంగా హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మెను విరమించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, రాముడు, శంకర్, రవి, దేవి, సీత తదితరులు పాల్గొన్నారు.

## 50 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్



రామభద్రపురం, మార్చి 15 ప్రభాతవార్త :

మండలం ఒక వ్యక్తి అక్రమముగా 50 మద్యం బాటిళ్లను పట్టుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు చెప్పారు. ఈ మేరకు అందించిన వివరాలిలా ఉన్నాయి. మద్యం బాటిల్ తరలిస్తున్న వ్యక్తి పిన్నవలస గ్రామం బాడంగి మండలం ఈ వ్యక్తి నుండి 50 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని వ్యక్తి ని అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్‌రావు చెప్పారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టు కు తరలిస్తున్నామని తెలిపారు.

## మంత్రి ప్రజాదర్బార్.. వినతుల స్వీకరణ..



గజపతినగరం,మార్చి 15 ప్రభాతవార్త :

రాష్ట్ర సూక్ష్మ,చిన్న, మధ్య తరహా ఎన్నారై వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ చేపట్టారు. ప్రజలు తమ తమ సమస్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతులు అందజేశారు. కాలం రాజుపేట గ్రామానికి చెందిన రెడ్డి గౌరమ్మ 2017లో తాను నిర్మించిన అంగన్వాడి ప్రహరీ గోడకు సంబంధించి రెండు లక్షల పదహారువేలు రూపాయలు బిల్లు చెల్లింపులు కోసం మొరపెట్టుకున్నారు. అలాగే అంగన్వాడి వర్కర్ సీతాదేవి, జామి మండలానికి చెందిన ఓ వ్యక్తి భూ సమస్యకు సంబంధించి ఇలా పలువురు తమ సమస్యలు పరిష్కారానికి మంత్రి శ్రీనివాస్ కి మొర పెట్టుకున్నారు. ఇందుకు ప్రతిగా స్పందించిన మంత్రి శ్రీనివాస్ ఈ ప్రజా దర్బార్లో ఇచ్చిన వినతులు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.వి.వి గోపాలరాజు, వైకుంఠ ప్రదీప్ కుమార్, కొండపల్లి భాస్కర్ నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మర్రివలస గ్రామంలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ

దత్తిరాజేరు, మార్చి 15 ప్రభాతవార్త :



మండలంలోని మర్రి వలస గ్రామంలో శ్రీ ఉమా లింగేశ్వర స్వామి నూతన రామాలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు శివాలయానికి లెంక వారి కుటుంబ సభ్యులు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు పురోహితులు రవి స్వామి లెంక వారి కుటుంబ సభ్యులతో మంత్రోచ్చారణతో పూజ చేసి శంకుస్థాపన చేసారు గ్రామ పెద్దలు ప్రజలు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయలుకొట్టారు గ్రామ ప్రజలు సహకారంతో రామాలయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు ఈ కార్యక్రమానికి. స్వామీజీ మండల జడ్పిటీసి రౌతురాజేశ్వరి పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

సర్కిల్ శాస్త్ర సెంటర్, విశాఖపట్నం,
డి.నెం. 9-13-45/2/9/1, 8వ అంతస్తు, ఎంవిఆర్
వినాయగర్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం-530003

**స్వాధీనత ప్రకటన**

**Annexure-13 (Revised SI-10 )** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **పంజాబ్ నేషనల్ బ్యాంక్ (బ్రాంచ్ పేరు: పార్వతీపురం(961400))** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: మెస్సర్స్ వేళాంగిణి క్యాష్యూ ప్రొసెసింగ్, ప్రొప్రయిటర్ : శ్రీ బొమ్మల వినోదరావు & శ్రీ బొమ్మల ఉదయ్ కిరణ్ (హామీదారు) & శ్రీ దొంకాడ గోవిందరాజు (హామీదారు)** వారు **తేది.19-12-2024** నాటికి (అసలు + వడ్డీ) చెల్లించవలసిన బకాయి మొత్తం **అకౌంట్ నెం. 961400SL00000072- Term Loan - PMEGP కు రూ.7,03,457.52 పై** (అక్షరాల ఏడు లక్షల మూడు వేల నాలుగు వందల యాభై ఏడు రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) + **తేది.20-12-2024** నుండి తదుపరి వడ్డీ వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.19-12-2024న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది **(తేది.30-11-2024న ఎన్.పి.ఏ అయినది).**

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది.11-03-2025న** దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీన పరుచుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా **తేది.19-12-2024** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.7,03,457.52 పై** (అక్షరాల ఏడు లక్షల మూడు వేల నాలుగు వందల యాభై ఏడు రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) + **తేది.20-12-2024** నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు **పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత చెల్లించిన మొత్తములు తీసివేయబడును.

**స్థిరాస్తి వివరములు**

**శ్రీ బొమ్మల వినోదరావు గారి పేరున గల ఆస్తి :** (విజయనగరం జిల్లా) ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా – 535521, కొమరాడ మండలం, కొమరాడ గ్రామం మరియు పంచాయితీ, ఎస్.సి. కాలనీ, డి.నెం.600, ఎస్.నెం.328/5 లోని 125 చ॥గజాలు లేదా 1125 చ॥అ॥ల విస్తీర్ణం గల నివాస భూమి మరియు అందు గల ఆర్‌సిసి స్లాబ్ భవనం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు :** సిల్లా పోతయ్య గారి ఇల్లు, **దక్షిణం :** బోనెల బుచ్చయ్య గారి ఇల్లు, **పడమర:** చెరుకుపల్లి సరోజినమ్మ గారి ఇల్లు, **ఉత్తరం :** పంచాయితీ రోడ్డు. **కొలతలు : తూర్పు – పడమర :** 25 అ॥లు (2.32 మీ॥లు), **ఉత్తరం – దక్షిణం :** 45 అ॥లు (4.45 మీ॥లు).

తేది : 11-03-2025
ప్రదేశం: విశాఖపట్నం

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



సంతబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్నతుంగాం, సంతబొమ్మాళి గ్రామ పంచాయతీలలో శనివారం పారిశుధ్యంపై అవగాహన గ్రామ సభలు జరిగాయి. చిన్న తుంగాం ఎంపీఈపీ స్కూల్ సంతబొమ్మాళి కెజిబివి స్కూల్ పరిధిలో పరిశుభ్రత, ప్లాస్టిక్, పాలిథిన్ కవర్స్ నివారిద్దాంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నినాదాలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. సంతబొమ్మాళి మండల ప్రత్యేక అధికారి బి.తిరుమలరావు, ఎంపీడీఓ పి.జయంత్‌ప్రసాద్, సంతబొమ్మాళి మండల పరిషత్ ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి ఐ.పద్మజ, సర్పంచ్‌లు శిమ్మ గోవిందరావు, కళింగపట్నం లక్ష్మి, సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కె.కాంతారావు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, తాళ్లవలస పంచాయతీ కార్యదర్శి జి.విజయ్‌కుమార్, గ్రామ సచివాలయాల సిబ్బంది, ఎంజిఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయం ముందు బిందెలతో ఎంపీటీసీ నిరసన



సంతబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

మండలంలోని నౌపడ పంచాయతీ పరిధిలో సీతానగరం గ్రామంలో కొద్ది రోజులుగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకునే పాపాన పోలేదని ఎంపీటీసీ సభ్యులు బత్తుల సుధాకర్ శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బిందెలతో నిరసనకు దిగారు. నౌపడ పంచాయతీలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ ఈ పంచాయతీ పరిధిలో సీతానగరం గ్రామస్తులు కొంత కాలంగా తాగునీటి అవస్థలు పడుతున్నారు. ఈ విషయం పలుమార్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు దృష్టిలో పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. ఈమేరకు ఎంపీటీసీ సుధాకర్ తమ గ్రామ సమస్య పరిష్కారం కోసం ఎంపీపీ, జెడ్పీటీసీ పలువురు సభ్యులతో నిరసన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

## పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కంచిలి, మార్చి 15, ప్రభాతవార్త

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, మన పరిసరాలు శుభ్రంగా ఉంచాలని హెచ్‌ఎం సోమేశ్వరరావు కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 3వ శనివారం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా కంచిలి మండలం బూరగాం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు శ్రమదానం చేసి చెత్తను ఒక చోట గొయ్యిలో వేసి ఎరువులకు ఉపయోగించే పద్ధతులను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకం నిషేధమని నినాదాలు చేశారు. ప్లేకార్డులతో మానవహారం ఏర్పాటు చేసుకుని ప్లేకార్డులను ప్రతి వీధిలో గోడలకు అతికించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ రోడ్డుపై చెత్త వేయకు, పర్యావరణాన్ని పాడు చేయకు, చెత్త ఉంటే పెంట తీసేస్తే పంట, ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు అనే నినాదాలతో హోరెత్తించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామం మధ్యలో మానవహారం చేసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చదివారు. ఉపాధ్యాయులు ధర్మారావు, కాంతారావు, శివరాం బెహర, నిరంజన్ ఖడంగా, జగన్మోహన్, లక్ష్మి, కుశరాజు, హరికృష్ణ, గ్రామయువత పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వస్తువుల తయారీ వాడకం నిషేధం



సీతంపేట, మార్చి 15 ప్రభాతవార్త

సీతంపేట మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల తయారీ వాడకంపై నిషేదం విధించడం జరిగిందని ఎంపీడీఓ గీతాంజలి స్పష్టం చేశారు. శనివారం సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒక్కసారి వాడి పడేసిన ప్లాస్టిక్ వస్తువుల తయారీ, వాడకం ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేదం పర్యావరణ అంశంపై మండలస్థాయిలో పోస్టర్ ప్రదర్శన సీతంపేట సచివాలయం 1లో ప్రారంభించారు. జిటిడబ్ల్యు ఏజిహెచ్‌ఎస్ హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు సుష్మిత, మౌనిక చేసిన పోస్టర్‌కు మొదటి బహుమతి ఇవ్వడం జరిగింది. విద్యార్థినుల పోస్టర్‌కు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, సీడీపీఓ రంగలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సత్యం, ఏపీఎం పార్వతి,ఎంజిఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సాగర్,సీతంపేట పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

### -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడ తన కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు వివరించారు. అలాగే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని పలువురు రైతులు మంత్రికి కోరగా త్వరలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఆదేశించిన అన్ని సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి



కోటబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

ప్రభుత్వం ఆదేశించిన అన్ని సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండలం చీపుర్లపాడు సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా ఆయన సందర్శించి ఉద్యోగుల హాజరు, ప్రస్తుతం నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం, పి4 సర్వేలో ప్రగతి, ఇంటి పన్ను వసూలు, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని, అన్ని సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబుని ఆదేశించారు. అలాగే కన్నేవలస పంచాయతీ కార్యదర్శి వనజకు సంపద కేంద్రం నిర్మాణం వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి



కోటబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

అధికారులు పారిశుధ్య కార్మికులకు సరైన ఆదేశాలు ఇచ్చి పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని మండలం కొత్తపేట గ్రామ ప్రధాన రహదారిలోని వ్యాపారులు,గ్రామస్తులు ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. శనివారం జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అధికారులు ముందు పరిశుభ్రత గూర్చి వివరించారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికులు నెలకు ఒకసారి వచ్చి రోడ్డు శుభ్రపర్చి చెత్తను తొలగిస్తున్నారని, ఆ తర్వాత చెత్తకుప్పలకు అగ్గిమంటలు వేసి వెళ్లిపోతున్నారని వారు తెలిపారు. షాపులు నుంచి వారికి ప్రతినెల డబ్బులు కూడా ఇస్తున్నామన్నారు. ఏది ఏమైన అధికారులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారంతా కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభం

ఎచ్చెర్ల, మార్చి 15 ప్రభాతవార్త

టెలికాం మౌలిక సదుపాయాల కంపెనీలలో ఒకటైన ఇండస్ టవర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ సహకారంతో విజయనగరంలో స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు, విజయనగరం జిల్లాలోని పది ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్ సౌకర్యాలను ప్రారంభించారు.

## పునర్వినియోగ వస్తువులు మాత్రమే వాడాలి :ఎంపీడీఓ



కోటబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదించి పునర్వినియోగ వస్తువులు మాత్రమే వాడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుప్పిలి ఫణీంద్ర కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన మండల పరిషత్ సిబ్బంది, వెలుగు, ఉపాధిహామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయం నుంచి కొత్తపేట వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి ప్లాస్టిక్ నిషేదంపై పలు దుకాణదారులకు అవగాహన కల్పించారు. మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపాధి హామీ వేతనదారులతో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు పారిశుధ్య పనులు నిర్వహించారు. అలాగే మండలంలో వివిధ గ్రామాల్లో కంపోస్టు పిట్స్, ఇంకుడు గుంతల నిర్మాణం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి జె.ఆనందరావు, సూపరింటెండెంట్ మంగరాణి, ఉపాధిహ్యామీ ఏపీఓ జి.హరిప్రసాద్, చీపుర్లపాడు టీడీపీ నాయకులు చల్ల రాము, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు?

### -ఎంపీపీతో సహా మండల సమావేశం నుంచి సభ్యులు వాకౌట్



సంతబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

సంతబొమ్మాళి మండలంలో శనివారం ఒక విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా ఎంపీపీతో సహా పలువురు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు సమావేశంను బహిష్కరిస్తూ బయటకు వెళ్లిపోయారు. ఈ మేరకు ఆర్‌హెచ్ పురం సర్పంచ్ ఎన్ని మన్మధరావు ఆధ్వర్యంలో సభ్యులు ఒక తీర్మానం కాపీని ఎంపీడీఓ జయంత్‌ప్రసాద్‌కు అందించారు. అనంతరం తీర్మానం కాపీని చదివి వినిపించారు. అంతకు ముందు కార్యాలయం పరిపాలనాధికారి కుమార్ సమావేశంలో వ్యవసాయశాఖపై చర్చకు పిలవగానే సభ్యులు మూకుమ్మడిగా లేచి బహిష్కరించారు. సభ్యులు ఇచ్చిన తీర్మానం సారంశం ఇలా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి మండలంలోని గ్రామ పంచాయతీలలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదనిన అందులో పేర్కొన్నారు. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు కూడా తయారు చేయడానికి మండల, పంచాయతీ స్థాయి అధికారులు సహకరించడం లేదని అలాంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకు దండగ అని ప్రశ్నించారు. అలాగే ఎంపీటీసీ సభ్యులు గౌరవ వేతనం కూడా గత ఏడాది కాలంగా ఇవ్వడం లేదని ఇదేనా సభ్యులకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవం అని అందులో పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి లేక ఎంపీటీసీలకు గౌరవం లేని సమావేశాలను బహిష్కరిస్తూ వాకౌట్ చేస్తున్నామని సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎంపీపీ లేని సర్వసభ్య సమావేశం నిర్వహించడం సాధ్యం కాదని కొంత సమయం తర్వాత ఎంపీడీఓ చెప్పడంతో అధికారులు కూడా వెళ్లిపోయారు. అంతకు ముందు ఉదయం పది గంటలకు జరగవల్సిన ఈ సమావేశం కనీసం కోరం సభ్యులు లేకపోవడంతో దాదాపు రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, వైస్ ఎంపీపీ నక్క చింతామణి, ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు, ఎంఈఓలు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



ఆముదాలవలస, మార్చి 15 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, రాష్ట్ర కాళింగ కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల నుంచి పలువురు ప్రజలు తమ వినతులను అందజేశారు. వ్యక్తిగత, ప్రజా సమస్యల కోసం పలువురు ధరఖాస్తులు చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని టీడీపీ నాయకులు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సుపరిపాలన అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పని చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఏ సమస్య ఉన్న ప్రజలు నేరుగా ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి వినతుల ద్వారా తీసుకుని వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, పల్లి సురేష్, కొండబాబు, పివికె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నడుకూరులో ఎట్టకేలకు పారిశుధ్య పనులు



వీరఘట్టం, మార్చి 15 ప్రభాతవార్త

మండలంలోని నడుకూరు పంచాయతీలో ఎట్టకేలకు పారిశుధ్య పనులను శనివారం పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కొత్తగా వచ్చిన కార్యదర్శి కోటేశ్వరరావు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగా తెలుసుకుని పారిశుధ్య పనులను చకచకా మొదలు పెట్టేశారు. వీరఘట్టానికి కూతవేటు దూరంలో ఉన్న నడుకూరు పంచాయతీకి ఆదాయ వనరులు బాగానే వస్తున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం కుంటిపడిందనే చెప్పాలి మరి. నడుకూరులోని మెయిన్ రోడ్డు, కాపువీధి, ఎస్సీ వీధిలలో ఇరువైపులా ఉన్న కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదరాలను తీయించే పనిలో పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు నిమగ్నమయ్యారు. కాలువల్లో పూర్తిగా పేరుకుపోయిన చెత్తాచెదరాల కారణంగా ఇళ్లల్లో వాడుక నీరు బయటకు వెళ్లకపోవడమే కాకుండా, కాలువల్లో పూర్తిగా పేరుకుపోయిన చెత్తా చెదారాల కారణంగా ఇళ్లల్లో వాడుక నీరు బయటకు వెళ్లకపోవడమే కాకుండా కాలువలు దుర్గంధమయంగా మారాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని నడుకూరులో చకచకా పారిశుధ్య పనులు చేపట్టడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## హైయర్ విస్తరణ

టెక్కలి, మార్చి 15 ప్రభాతవార్త

వరుసగా 16 సంవత్సరాలు నెంబర్ 1 గ్లోబల్ మేజర్ అప్లయెన్సెస్ అయిన హైయర్ అప్లయెన్సెస్ ఇండియా తన ఎసి తయారీని గ్రౌండ్ బ్రేకింగ్ సామర్థ్యాలతో విస్తరించింది. గ్రేటర్ నోయిడా ప్లాంట్‌లో కొత్త ఇంజెక్షన్ మోల్డింగ్ సదుపాయాన్ని ప్రారంభించింది. భారతదేశంలోని ప్రముఖ గృహోపకరణాల తయారీదారులలో ఒకటైన ఈ అభివృద్ధి మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా చొరవను బలోపేతం చేసే దిశగా మరొక అడుగు ముందుకు వేసింది.

## స్వచ్ఛాంధ్రలో చీపురు పట్టిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



నందిగాం, మార్చి 15 ప్రభాతవార్త

పలాసలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే శిరీష చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం ఇంటింటా పర్యటించి చెత్తను సేకరించారు. మాట్లాడిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిసరాలు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పలాసను పరిశుభ్రతలో ఏపీ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలపాలని ఆకాంక్షించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్హాద్‌ఖాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఖండ్యం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర



రేగిడి, మార్చి 15 ప్రభాతవార్త

మండలం ఖండ్యం గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్ మరియు గ్రామ పంచాయతీ సెక్రటరీ టి.పోలినాయుడు, గ్రామ సర్పంచ్ కె.ముత్యాలమ్మ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి, వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మరియు పొడి చెత్త, తడిచెత్తను వేరు చేసి పరిసరాలకు దూరంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పడి వేయాలని, మన గ్రామాన్ని ఎవరికి వారే పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. గ్రామ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్య లోపం లేకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం ప్రతి నెల మూడవ శనివారం ఉంటుందని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా తప్పనిసరిగా పాల్గొవాలని కోరారు. సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## డయాలసిస్ యూనిట్లు ప్రారంభం



శ్రీకాకుళం, మార్చి 15 ప్రభాతవార్త

పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రెండు డయాలసిస్ యూనిట్లును ఎఎంసీఎఎన్ఎ విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో చదివి అమెరికాలో ఉంటున్న డాక్టర్లు నుంచి నిధులు సేకరించి డాక్టర్ రవిరాజు, డాక్టర్ నవీన్ చేతుల మీదుగా శనివారం కిడ్నీ డయాలసిస్ ఆసుపత్రికి అందజేయడం జరిగింది. 5 డయాలసిస్ యూనిట్లును ఐఓసి ఇడి సుధాకరరావు చేతుల మీదుగా 3 డయాలసిస్ యూనిట్లును కలెక్టర్ ద్వారా మంజూరు చేయించి యూనిట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష మరియు గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ సెక్రటరీ వెంకన్న చౌదరి కృషితో సాధించారు. ఈ కార్యక్రమానికి ఇరువురు మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్, ఆర్‌డిఓతో హాజరై కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని పరిశీలించి ఇతర సమస్యలు అన్నింటినీ అర్థం చేసుకుని కార్యాచరణ చేయడానికి సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజ, గ్లోసంస్థ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ వెంకన్న చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత



రేగిడి, మార్చి 15 ప్రభాతవార్త

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్యామలకుమారి, తహశీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం రేగిడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడడం ఆరోగ్యానికి అనర్థం అన్నారు. ప్లాస్టిక్ వాడకం అనేక ప్రాణాంతక వ్యాధులకు కారణమన్నారు. పరిశుభ్ర గ్రామాల ద్వారా స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం అవుతుందని వారన్నారు. ఈ మేరకు గ్రామంలో విద్యార్థులు, గ్రామ ప్రజలతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి ఏవి సత్యనారాయణ, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ పద్మ, ఏపీఎం గోవిందరావు, కార్యదర్శి స్రవంతి, క్లాప్స్ మిత్రలు, సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ తహశీల్దార్, మండల కోఆర్డినేటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సుందర మండలంగా వీరఘట్టం



వీరఘట్టం, మార్చి 15 ప్రభాతవార్త

స్వచ్ఛ సుందర మండలంగా వీరఘట్టం రూపుదిద్దుకోవాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం వీరఘట్టంలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ నిషేదం అనే నినాదంతో అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాతావరణ కాలుష్యానికి, ఆరోగ్యానికి ప్లాస్టిక్ సంచుల వినియోగం ఎంత హానికరమో ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. తమ వంతు బాధ్యతతగా ఇంటి పరిశుభ్రతకు భాగస్వామ్యం కావాలని కోరారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చున్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి స్వచ్ఛ సుందర మండలంగా రూపుదిద్దుకునేలా తమ వంతు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు, స్టీల్ బాక్స్‌లు వంటివి వాడకాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి ప్లాస్టిక్ అనే పదమే వినిపించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి టి.రమణమూర్తి, ఎపిఎం కె.రాము, పంచాయతీ ఈఓ బి.కోటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాన్యశ్రీ కాన్షిరామ్ 91వ జయంతి వేడుకలు



కొత్తూరు, మార్చి 15 ప్రభాతవార్త

కొత్తూరు మండల కేంద్రంలో బహుజన రాజకీయ సిద్ధాంత కర్త బాబాసాహెబ్ అంబేద్కర్ పంట మాన్య శ్రీ కాన్షీరామ్ 91వ జయంతి కార్యక్రమం బిఎస్‌పి పాతపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బొడ్డేపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బొడ్డేపల్లి కృష్ణారావు కాన్షీరామ్ త్యాగాలు గురించి మాట్లాడుతూ చెల్లాచెదురుగా ఉన్న ఎస్‌సి, ఎస్టీ, ఓబిసిలో చదువుకున్న ఉద్యోగులు అందరినీ సమీకరించి పేబేక్ టు సొసైటీ గురించి చైతన్యపరుస్తూ అంబేద్కర్ ఆలోచనా విధానం ద్వారా మాత్రమే బహుజనులకు విముక్తి లభిస్తుందని ఆయన తెలియజేశారన్నారు. 1984 ఏప్రిల్ 14న బహుజన సమాజ్ పార్టీ ని స్థాపించి ఇండియాకు గుండెకాయ లాంటి ఉత్తరప్రదేశ్‌కు నాలుగుసార్లు సోదరి కుమారి మాయవతిని ముఖ్యమంత్రిగా చేసి బిఎస్పీని మూడవ జాతీయ పార్టీగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు డి.జమ్మయ్య మాస్టారు, వడమ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రామకృష్ణ, గుడబండి సింహాచలం, మురపాక శంకరరావు, సల్ల మన్మధరావు, తలచంద్రి రాంబాబు, సుబ్బారావు, తేగల బుడ్డు, అలికాన శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## కొఠారి ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు



ఇచ్ఛాపురం, మార్చి 15 ప్రభాతవార్త

కొఠారి పంచాయతీ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో తేటతెల్లమైంది. మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. 30వేల రూపాయలు ఫీల్డ్ అసిస్టెంట్లు పక్కదారి పట్టించినట్లు వెల్లడించారు. కొఠారి పంచాయతీ మరోమారు సోషల్ ఆడిట్ నిర్వహించాలని తెలుగుదేశం నాయకులు మాజీ ఎఎంసి చైర్మన్ సాడి సహదేవరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఏపీడీ కె.లోకేష్ విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. ఇద్దరు కిడ్నీ డయాలసిస్ రోగులు మరోఇద్దరు పక్షవాతం రోగులు పనులు చేస్తున్నట్లు మస్టర్లు వేశారు. ఇతర రాష్ట్రాలు వలస వెళ్లినవారు పనులు చేస్తున్నట్లు మస్టర్లు వేస్తున్నట్లు, పనికి వెళ్లకపోయినా హాజరు వేస్తున్నట్లు మరో 15 మంది కూలీలు పేరున తప్పుడు హాజరు వేస్తున్నట్లు ఫిర్యాదు చేయడంతో తీవ్ర ధ్వజమెత్తారు. అనంతరం మిగిలిన పంచాయతీల సామాజిక తనిఖీల్లో 1.20లక్షల రూపాయల రికవరీకి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, డివిఓ స్వరూపకుమారి, డిఆర్‌పి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

## ఏడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు



ఇచ్ఛాపురం, మార్చి 15 ప్రభాతవార్త

మండలంలో ఈ నెల 17 నుంచి ఏడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు ఎంఈఓ కె.అప్పారావు చెప్పారు. పురుషోత్త పురం మోడల్ స్కూల్, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలు మండపల్లిలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1498 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ 2 విశ్వనాథంతో కలిసి పరిశీలించారు.

## స్మశానవాటికకు బోరుబావి ఏర్పాటు చేయండి



సంతబొమ్మాళి, మార్చి 15 ప్రభాతవార్త

బోరుభద్ర దళిత స్మశాన వాటికకు బోరుబావి ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం ఎంపీడీఓకు ఒక వినతిపత్రంలో కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఏఓ కుమార్‌కు అందించారు. గ్రామంలో దళితులకు ప్రత్యేకమైన స్మశానవాటిక ఉందని ఎటువంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో తెలిపారు. అలాగే ఈ స్మశానవాటికకు రక్షణ గోడ నిర్మాణం కూడా మంజూరుచేసి నిధులు కేటాయించాలని సర్పంచ్ కోరారు.

